



తెలుగు జాతీయ దినపత్రిక

# అక్షర విజేత

నిజం నిర్భయం నిష్పక్షం

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక



B. ANIL KUMAR
CHAIRMAN & CHIEF EDITER
7702866885
9059324231

అక్షర విజేత

DAIWIK PUBLICATIONS & BROADCASTING PVT. LTD.
www.aksharavijetha.com., epaper.aksharavijetha.com
email : vijethatelugudaily@gmail.com

కావలెను


విజేత ఛానల్‌లో పని చేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుండి విలేకరులు, యాంకర్లు, న్యూస్ ఎడిటర్లు, కంటెంట్ రైటర్స్, కెమెరా మెన్, మరియు స్టూడియోలో పనిచేయుటకు స్త్రీ & పురుష సిబ్బంది కావలెను.

సీనియర్లకు ప్రాధాన్యత ఉంటుంది.

సంప్రదించుటకు: 7702866885, 9059324231



ఆంధ్రప్రదేశ్ సంపుటి:05 సంచిక : 81 ఎడిటర్ : బి. అనిల్ కుమార్ పేజీలు : 10, వెల. 6రూ/ గురువారం 25 డిసెంబర్ 2025


# మేడారం మహోత్సవం

- శాశ్వత అభివృద్ధి దిశగా అడుగులు

- భక్తుల సౌకర్యార్థం రూ. వందల కోట్లతో మౌలిక వసతుల కల్పన

-ఇక ప్రతి ఏటా ఇబ్బందులు లేని దర్శనం

5

అక్షరవిజేత ఎడిటర్ డా.బి,అనిల్ కుమార్/మేడారం (ములుగు): ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగగా పేరుగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర క్షేత్రం ఇకపై కేవలం జాతర సమయంలోనే కాకుండా, ఏడాది పొడవునా భక్తులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం భారీ ప్రణాళికను అమలు చేస్తోంది. గతంలో కేవలం జాతర ముగియగానే తాత్కాలిక ఏర్పాట్లు కనుమరుగయ్యేవి, కానీ ఇప్పుడు 'శాశ్వత అభివృద్ధి' మంత్రంతో పనులు శరవేగంగా సాగుతున్నాయి.

**ప్రధాన అభివృద్ధి పనులు ఇవే**

జంపన్న వాగు వద్ద శాశ్వత భక్తుల రద్దీని తట్టుకునేలా జంపన్న వాగు వెంట కిలోమీటరు మేర కాంక్రీట్ మెట్లు, స్నానఘట్టాలను నిర్మించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు కూడా భక్తులు సురక్షితంగా స్నానాలు ఆచరించేలా రక్షణ గోడలను బలోపేతం చేశారు.గ్రామంలోని అంతర్గత రహదారులన్నింటినీ బి.టి మరియు సి.సి రోడ్లుగా మార్చారు. ప్రధానంగా పస్రా నుంచి మేడారం వరకు, తాడ్వాయి నుంచి మేడారం వరకు ఉన్న రహదారులను విస్తరించి, భారీ వాహనాలు సులువుగా వచ్చేలా వంతెనల నిర్మాణం చేపట్టారు.



## 2028లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు బొందపెట్టడం ఖాయం

**నీటి ద్రోహంపై సమాధానం చెప్పలేక ఇష్టారీతిన మాట్లాడుతున్నారని ధ్వజం**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి అహంకారంతో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోస్గిలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందిస్తూ, 2028లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడం ఖాయమని అన్నారు. నీటి ద్రోహంపై సమాధానం చెప్పలేక ఇష్టారీతిన మాట్లాడుతున్నారని విమర్శించారు.

నదీ జలాల హక్కులను కాపాడటం చేతకాని అసమర్థుడు అహంకారంతో మాట్లాడుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాలమూరు ప్రాజెక్టు గొంతుకోసి సొంత జిల్లానే మోసం చేస్తున్నాడని ఆరోపించారు. అది చాలదన్నట్లుగా కేసీఆర్‌పై ఏది పడితే అది మాట్లాడుతున్నారని అన్నారు. సభ్యత, సంస్కారం లేని నీచమైన రేవంత్ రెడ్డి ప్రవర్తనను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు.

ప్రజలు ఛీకొడుతున్నా ఇంకా మారవా అని ఎద్దేవా చేశారు. శాసనసభతో పాటు జనసభలోనూ కాంగ్రెస్ పార్టీ జలద్రోహాన్ని ఎండగడతామని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో వందేళ్ల వరకు కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, సందర్భం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

### నేను రాజకీయాల్లో ఉన్నంత వరకు

# కల్వకుంట్ల కుటుంబాన్ని అధికారంలోకి రానివ్వను..

-ఇదే నా శపథం: రేవంత్ రెడ్డి

-కొడంగల్ బిడ్డగా ఇదే గడ్డ మీది నుంచి చెబుతున్నానని సవాల్

-బీఆర్ఎస్ గతం కాంగ్రెస్ భవిష్యత్తు అన్న రేవంత్ రెడ్డి

-కేసీఆర్ నన్ను జైలుకు పంపించి నా కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టాడని వ్యాఖ్య



5

కొడంగల్ బిడ్డగా ఇదే గడ్డ మీది నుంచి ఒక మాట చెబుతున్నానని, తాను రాజకీయాల్లో ఉన్నంత వరకు కేసీఆర్ సహా కల్వకుంట్ల కుటుంబాన్ని అధికారంలోకి రానివ్వనని, ఇదే తన శపథమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లా కోస్గిలో ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి రానివ్వనని, ఇదే తన సవాల్ అన్నారు.

## నేను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నా

-ఫిరాయింపు ఎమ్మెల్యేలపై తనకు సమాచారం లేదన్న దానం

-జీహెచ్ఎంసీలో కాంగ్రెస్, ఎంఐఎం కూటమి విజయం సాధిస్తుందని ధీమా

తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపుల చర్చలు ముదురుతున్న వేళ, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కీలక ప్రకటన చేశారు. తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని స్పష్టం చేసిన ఆయన, ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎవరు? వారు ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారు? అన్న విషయాలు తనకు తెలియవని అన్నారు. "నేను ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ గెలుస్తుంది" అంటూ దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎంఐఎం కలిసి మొత్తం 300 డివిజన్లలో విజయం సాధిస్తాయని ఆయన ధీమా వ్యక్తం వేశారు. గ్రేటర్ హైదరాబాద్ అంతటా విస్తృతంగా ప్రచారం చేస్తానని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలిపారు.ఇటీవల బీఆర్ఎస్ తరఫున గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ



గులాబీ పార్టీ పోరాటం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా ఎమ్మెల్యేలు తాము ఇంకా బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నామని చెబుతున్నారు. అయితే, ఈ పరిణామాలకు భిన్నంగా దానం నాగేందర్ మాత్రం బహిరంగంగా తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నానని అంగీకరించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

## రెండు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలనేదే చంద్రబాబు లక్ష్యం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ గురించి, ఏపీకి వస్తున్న పెట్టుబడుల గురించి కేసీఆర్ మాట్లాడిన తీరు అభ్యంతరకరమని మండిపడ్డారు. భాష, యాస, ప్రాసలపై పట్టు ఉందని ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే కుదరదని అన్నారు. విజయవాడ ప్రెస్ క్లబ్ లో జరిగిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఏపీకి వస్తున్న పెట్టుబడులపై మీకు ఏవైనా అనుమానాలు ఉంటే... వాటిని పారదర్శకంగా మీకు చూపిస్తామని కేసీఆర్ కు పార్థసారథి సూచించారు. ఏపీలో పెట్టుబడులు పెట్టిన వారు తెలంగాణలో కూడా పెట్టుబడులు పెట్టారని చెప్పారు. రెండు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలనేదే తమ ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని... ఈ విషయాన్ని ఆయన ఎన్నోసార్లు చెప్పారని గుర్తు చేశారు. ఐదేళ్ల వైసీపీ విధ్వంసం నుంచి అమరావతిని అభివృద్ధి చేస్తుంటే... మీరు ఇలా మాట్లాడటం తగదని అన్నారు.



# విద్యార్థులు సాధారణ ప్రాజెక్టులే కాకుండా పేటెంట్ స్థాయికి చేరేలా మార్గనిర్దేశం చేయాలి

## .ఎఐసిటిఇ ఉపాధ్యక్షులు, విద్యా మంత్రిత్వ శాఖ ప్రధాన ఇన్నోవేషన్ అధికారి డా.అభయ్ జెరే.




అక్షర విజేత, ఇబ్రహీంపట్నం :-గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్ టెక్నికల్ క్యాంపస్‌లో పిఎం షరి ఉపాధ్యాయుల జాతీయ ఐడిఈ బూట్‌క్యాంప్ సదస్సు ఘనంగా ముగిసింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కోసం నిర్వహించిన మూడు రోజుల జాతీయ సదస్సు "ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ (ఐడిఇ) బూట్‌క్యాంప్" అనే అంశం పైన గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్ టెక్నికల్ క్యాంపస్ (జిఎన్ఐటిసి)లో విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమాన్ని పాఠశాల విద్య, సాక్షరత విభాగం, అఖిల భారత సాంకేతిక విద్యామండలి, విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన



ఇన్నోవేషన్ సెల్ సంయుక్తంగా నిర్వహించాయి. భారతీయ పాఠశాలలలో ఇన్నోవేషన్ సంస్కృతిని పెంపొందించడంలో ఈ సదస్సు ప్రముఖ పాత్ర పోషిస్తుందని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ నెల 22 నుంచి 24, 2025 వరకు జరిగిన ఈ బూట్‌క్యాంప్‌ను గ్లోబల్ స్థాయిలో ఎంట్రప్రెన్యూర్‌షిప్ విద్యలో ముందున్న వాధ్వానీ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎఐసిటిఇ ఉపాధ్యక్షులు, విద్యా మంత్రిత్వ శాఖ ప్రధాన ఇన్నోవేషన్ అధికారి డా.అభయ్ జెరే పాల్గొని "ఇన్నోవేషన్, సమస్యల పరిష్కారానికి మానవ కేంద్రిత దృక్పథం" అనే అంశంపై మాట్లాడుతూ... పాఠశాల విద్యార్థులు సాధారణ ప్రాజెక్టులకే పరిమితం కాకుండా పేటెంట్ స్థాయి వరకు చేరేలా మార్గనిర్దేశం చేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా అయన సదస్సులో పాల్గొన్న ఉపాధ్యాయులకు మార్గనిర్దేశనం చేశారు. యోగేష్ డి.బ్రహ్మంకర్, విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్‌లో ఇన్నోవేషన్ డైరెక్టర్, రాష్ట్రస్థాయి ప్రారంభోత్సవానికి ఎఐసిటిఇ సమగ్ర శిక్ష అభియాన్‌కు చెందిన ఉన్నత స్థాయి అధికారులు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ ఇండియా రైసింగ్ పాఠశాలల నుంచి 190కి పైగా మంది ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొని, తమ సంస్థలలో ఇన్నోవేషన్ అంబాసిడర్లుగా మారేందుకు రూపొందించిన ప్రాక్టికల్ వర్క్‌షాప్‌లలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆతిథ్యం ఇవ్వడంలో గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్, గురునానక్ యూనివర్సిటీ నాయకత్వం కీలక పాత్ర పోషించిందని అతిధులు తెలియచేసారు. సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ, జి.ఎన్.యూ చాన్స్‌లర్, జి.ఎన్.ఐ వైస్ చైర్మన్, జాతీయ విద్యా విధానం (ఎన్.ఇ.పి) 2020 దృష్టికోణానికి అనుగుణంగా ఉన్న ఈ జాతీయ కార్యక్రమానికి ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.ఎన్.యూ వైస్ చాన్స్‌లర్, జి.ఎన్.ఐ మేనేజింగ్ డైరెక్టర్ డా.హెచ్.ఎస్. సైనీ, జి.ఎన్.ఐ.టి.సి డైరెక్టర్ డా.ఎస్.శ్రీనాథ రెడ్డి, జి.ఎన్.ఐ.టి.సి ఆర్ అండ్ డి డీన్ డా.ఎస్.వి.రంగనాయకులు, వివిధ విభాగాల అధిపతులు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి:

### వైద్య ఆరోగ్యశాఖ సమీక్ష సమావేశంలో

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

అక్షర విజేత, కరీంనగర్ ప్రతినిధి: ప్రభుత్వ ఆసుపత్రులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వైద్య ఆరోగ్యశాఖ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఒక్కో పీహెచ్‌సీ వారీగా సాధించిన ప్రగతి, పీహెచ్‌సీ వారీగా కాన్పులు తదితర వివరాలపై సమీక్షించారు. ప్రసవాలు, ఆరోగ్య మహిళ, ఎన్ఆర్సి, ఆర్బిఎస్కే,108సేవలు, ఆరోగ్యశ్రీ, ఐ, డెంటల్ ఎగ్జామినేషన్, లెప్రసీ సర్వే, టీబీ, ఇమ్యూనైజేషన్ క్యాలెండర్, బూస్టర్ డోస్, గర్భిణీల వివరాలు ఆన్లైన్లో నమోదు చేయడంపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కనీసం 80శాతం డెలివరీలు ప్రభుత్వ దవాఖానల్లోనే జరిగేలా చూడాలని, గర్భిణీలకు ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన కల్పించాలని అన్నారు. గర్భం దాల్చిన నాటి నుంచి కాన్పు అయ్యేంత వరకు ఆరోగ్య పరిరక్షణపై ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఆర్ బి ఎస్ కే పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్దేశించిన సంఖ్యలో విద్యార్థులకు స్క్రీనింగ్ చేయాలని, పనితీరు




మెరుగు పరచుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి గర్భిణి సంబంధించిన వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, గర్భిణీల్లో రక్త హీనత లేకుండా చూడాలని అన్నారు. నాణ్యమైన సేవలందిస్తూ ప్రభుత్వ దవాఖాన పని తీరు పట్ల ప్రజల్లో మరింత నమ్మకాన్ని పెంచాలని తెలిపారు. పలు ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరుగుతుండటంపై వైద్యాధికారులను ప్రశంసించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ మందుల కొరత రాకుండా చూడాలన్నారు. రాష్ట్రంలోనే మొదటిసారి జిల్లాలో డెంటల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తున్నామని పాఠశాలల్లో, పంచాయితీల్లో వైద్య శిబిరాలు నిర్వహించి పరీక్షలు చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న ఆంబులెన్సను డ్రైవర్లు లేరనే కారణంతో ఖాళీగా ఉంచొద్దని.. అవసరమైన సిబ్బంది ఉన్నచోట సర్దుబాటు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా నిక్షయ్ పోర్టల్ లో టీబీ




వ్యాధిగ్రస్తుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. వారికి అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి ప్రభుత్వాసుపత్రులకు వస్తున్నారు. ప్రభుత్వం అందించే మందుల కోసం రాష్ట్రంలోనే మన జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య పెరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందుకు సిబ్బందిని అభినందించారు. అనంతరం క్రిస్మస్ ను పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. ఈ సమావేశంలో డిఎంహెచ్వో వెంకటరమణ, అదనపు డీఎంహెచ్వో సుధా, డిప్యూటీ డిఎంహెచ్వోలు చందు నాయక్, రాజగోపాల్, ఇమ్యునైజేషన్ అధికారి సాజిదా, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, జిజిహెచ్ సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఆర్ఎంఓ నవీన, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## క్రిస్మస్ పండగను పురస్కరించుకొని దౌలతాబాద్‌లో ప్రభుత్వం నిర్వహించిన క్రిస్మస్ పండుగ సంబరాల కార్యక్రమానికి మంత్రి వివేక్ గడ్డం వెంకటస్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

అక్షర విజేత, సిద్దిపేట ప్రతినిధి:ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమం కోసం ఎప్పుడూ కృషి చేస్తుందని అన్నారు. ప్రపంచమంతటికి శాంతి, క్షమా గుణాలను అందించిన ఏసుక్రీస్తు ను స్మరించుకుంటూ క్రిస్మస్ పండగలో పాలుపంచుకోవడం నాకు చిన్ననాటి నుండి అలవాటని వారిని అనుసరించి క్షమాగుణాన్ని నేర్చుకున్నానని అన్నారు. క్రైస్తవ సోదరులు సంతోషంగా క్రిస్మస్ పండుగను అందరి మధ్య జరుపుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా క్రిస్మస్ పండుగను నిర్వహిస్తుందని తెలిపారు. ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపడుతుందని వాటిలో భాగంగా మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు 27 వేలకోట్ల రూపాయలను రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం అందించింది అని అన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డుల పంపిణీ తదితర కార్యక్రమాలను చేపట్టిందని, త్వరలో కొత్త పెన్షన్ లను కూడా అందిస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ. ప్రతి సంవత్సరం మీ మధ్యలో క్రిస్మస్ పండుగను జరుపుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. అందరు సంతోషంగా పండుగ జరుపుకోవాలని ఈ క్రిస్మస్ పండుగ సంబరాల కార్యక్రమం ఏర్పాటుచేయడమైనదని తెలిపారు. కొత్తగా ఎన్నికైన గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని, ప్రజలను దేవుడు దీవించాలని ఆశించారు. అనంతరం ముఖ్య



అతిథులు క్రిస్మస్ కేకును కట్ చేసి క్రైస్తవ సోదరులకు తినిపించారు. ఈ కార్యక్రమంలో దౌలతాబాద్ సర్పంచ్ అనురాధ రమేష్, పాస్టర్లు, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో 7 మండలాలకు సంబంధించిన విద్యా,వైద్య వ్యవసాయ, విద్యుత్ అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం

:అక్షర విజేత, హుస్నాబాద్ ప్రతినిది:హుస్నాబాద్ నియోజకవర్గంలో విద్యుత్ సంబంధిత సమస్యలు, యాసంగి పంటల విధానం, యూరియా సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన చర్యలు,పాఠశాల మౌలిక వసతులు,మండలాల్లో మెడికల్ క్యాంపులు గ్రామాల్లో ఆరోగ్య పరీక్షలు తదితర అంశాలపై సమీక్ష..సమీక్షా సమావేశంలో పాల్గొన్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు, శివయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్, మెడికల్ ఆఫీసర్లు,ఏఈలు, ఎంపిఓలు, ఎంఈవో లు ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ప్రశాంతంగా బజార్ హత్నూర్ మండల మార్కెట్ బంద్.

అక్షర విజేత, బజార్ హత్నూర్ ప్రతినిధి:ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలంలో పంట కొనుగోలులో ప్రభుత్వ తిరును నీరకరిస్తూ అఖిలపక్షం పిలుపించిన బజార్ హత్నూర్ మార్కెట్ బంద్ ప్రశాంతంగా కొనసాగింది. బంద్ కు మద్దత్తు తెలుపుతూ వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు దీంతో మండల కేంద్రంలోని విధులు నిర్మానుస్యంగా మారాయి. రంగు మారిన సోయాబీన్‌ను వెంటనే కొనుగోలు చేయాలి. రంగు మారిన మొక్కజొన్నను తక్షణమే ప్రభుత్వం కొనుగోలు చేయాలి.ప్రతి రైతుకు గతంలాగానే యూరియా బస్తాలు సరఫరా చేయాలి. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. బంద్‌కు మండలంలోని రైతులు, వివిధ సంఘాలు మద్దతు ప్రకటించారు.



# న్యూ ఇయర్ వేడుకల వేళ హద్దులు దాటితే కఠిన చర్యలు

: హైదరాబాద్ సీపీ సజ్జనార్అక్షర విజేత, హైదరాబాద్ ప్రతినిధి:న్యూ ఇయర్ వేడుకల్లో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్న సీపీ ఈవెంట్‌లకు పోలీస్ అనుమతి, సీసీటీవీ ఏర్పాటు తప్పనిసరి అని వెల్లడి.రాత్రి 10 గంటలకే లౌడ్ స్పీకర్లు, సౌండ్ సిస్టమ్‌లు క్లోజ్ చేయాలని ఆదేశాలు..ఈ నెల 31న రాత్రి 9 గంటల నుంచే డ్రంకెన్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ ఉంటుందన్న సజ్జనార్.నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకునేలా చూడడానికి హైదరాబాద్ పోలీసులు సమాయత్తమవుతున్నారు. ఈ క్రమంలో న్యూ ఇయర్ ఈవెంట్లలో నిర్వాహకులు గానీ, ప్రజలు గానీ హద్దులు దాటినా లేక నిబంధనలు అతిక్రమించినా కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కొత్త సంవత్సరం సంతోషం లేకుండా పోతుంది అంటూ ఆయన వార్నింగ్ ఇచ్చారు.న్యూ ఇయర్ సందర్భంగా నగరంలో నిర్వహించే పార్టీలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన విధి విధానాలపై సీపీ సజ్జనార్ క్షేత్రస్థాయి పోలీస్ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఈవెంట్ జరిగే ప్రాంతంలో తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. అలాగే పార్టీల నిర్వహణకు ముందుగా పోలీస్ అనుమతిని తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి పొందాలని సూచించారు.బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించే వేడుకల్లో సౌండ్ సిస్టమ్‌లు, లౌడ్ స్పీకర్లు రాత్రి 10 గంటలకే పూర్తిగా నిలిపివేయాలని సీపీ స్పష్టం చేశారు. శబ్ద కాలుష్యంపై ఫిర్యాదులు వస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు, 15 షీ టీమ్స్ బృందాలను మఫ్టీలో రంగంలోకి దింపనున్నట్లు తెలిపారు.ఈ నెల 31 అర్ధరాత్రి నగరమంతటా డ్రంకెన్ డ్రైవ్‌పై ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు సీపీ సజ్జనార్ వెల్లడించారు. రాత్రి 9 గంటల నుంచే డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ప్రారంభమవుతాయని, అన్ని ప్రధాన రహదారులు, జంక్షన్ల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రజలు ఆనందంగా న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలని, అయితే చట్టాన్ని గౌరవిస్తూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని హైదరాబాద్ పోలీసులు కోరుతున్నారు.



# రైతు భరోసా పథకంపై తెలంగాణ ప్రభుత్వం కీలక మార్పులు:

అక్షర విజేత, హైదరాబాద్ ప్రతినిధి:ఇకపై నాగలి పట్టి సాగు చేసే రైతులకే రైతు భరోసా నిధులని స్పష్టం చేసిన సీఎం రేవంత్.సాగుకు అనుకూలంగా లేని భూములకు గతంలో ఇచ్చినట్లు రైతు భరోసా ఇవ్వడం సాధ్యం కాదని వెల్లడి.ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో వెల్లడించిన సీఎం రేవంత్ రెడ్డి.తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకంలో కీలక మార్పులు చేస్తోంది. ఈ పథకం అమలు, మార్గదర్శకాలపై జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యమైన ప్రకటన చేశారు. ఇకపై రైతు భరోసా నిధులను కేవలం సాగు చేసే రైతులకే అందించాలని ఆయన ఆదేశించారు. సాగుకు అనుకూలంగా లేని భూములకు గతంలో ఇచ్చినట్లుగా ఇవ్వడం సాధ్యం కాదని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని ప్రారంభించింది. రైతన్నలకు పెట్టుబడి సాయంగా ఎకరాకు రూ.4 వేల చొప్పున రెండు సీజన్లకు రూ.8 వేలు మొదట చెల్లించింది. ఆ తర్వాత పెట్టుబడి సాయాన్ని ఎకరాకు రూ.5 వేలకు పెంచింది. అయితే, ఈ పథకంలో అనర్హులు లబ్ధి పొందుతున్నారని ఆరోపణలు వచ్చాయి. వ్యవసాయం చేయని వారు, బీడు భూములు, కొండలు, గుట్టలు ఉన్న భూములకు కూడా నిధులు పొందినట్లు గుర్తించారు.అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బంధు పథకాన్ని రైతు భరోసా పథకంగా మార్పు చేస్తూ,ఎకరాకు పెట్టుబడి సాయం రూ.6 వేలకు పెంచింది. ఈ పథకం ద్వారా అనర్హులు సైతం లబ్ధి పొందుతున్నారని రేవంత్ ప్రభుత్వం గుర్తించింది. ఈ క్రమంలో అర్హులైన రైతులకే ఈ పథకాన్ని వర్తింపజేయాలని నిర్ణయానికి వచ్చింది. సాగు చేసే భూములకు మాత్రమే పెట్టుబడి సాయం అందించాలని నిర్ణయించారు.



## జగదేవ్ పూర్ మండలంలోనీ తీగుల్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో సందర్శించారు

అక్షర విజేత, సిద్దిపేట ప్రతినిధి:ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న మేజర్, మైనర్ రిపేర్లను పరిశీలించారు. వాటర్ కనెక్షన్, టాయిలెట్స్ లో ట్యాప్ లీకేజీలు చెక్ చేసుకోవాలని రిపేర్లు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణిత కాల వ్యవధిలో పూర్తి అయ్యేలా పని చేయించుకోవాలని మెడికల్ ఆఫీసర్ ను ఆదేశించారు. పిఎచ్ సి లోపల ఎల్లపుడు శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అటెండెన్స్ రిజిస్టర్ ఓపి రిజిస్టర్ వెరిఫై చేశారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించాలని మెడికల్ ఆఫీసర్ మరియు సిబ్బందిని ఆదేశించారు. ప్రాంగణం బయట చెత్త చెదారం పిచ్చి మొక్కలు తొలగించాలని గ్రామపంచాయతీ అధికారులను ఆదేశించారు.



# కొత్త సర్పంచ్‌లూ మీది పెద్ద బాధ్యత

## -:జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ సెక్రటరీ వడ్డేపల్లి హనుమంతు

అక్షర విజేత, హైదరాబాద్ ప్రతినిధి:గ్రామాన్ని పునర్నిర్మించే బృహత్తర బాధ్యతను గ్రామ ప్రజలు కొత్త సర్పంచ్‌లకు ఇచ్చారు. ఇది చాలా గురుతరమైన కర్తవ్యం. సర్పంచ్ ఈ కర్తవ్యానికి తనకున్న అధికారాలకు తోడుగా సంకల్ప బలాన్ని జోడిస్తే గ్రామ స్వరాజ్యం కలలు నెరవేరుతాయి.ఏ పనికైనా అధికారాలు మాత్రమే ఉంటే సరిపోవు. దాంతో పాటుగా ప్రజలందర్నీ ఐక్యం చేసి నడిపించే నాయకత్వం ఎంతో అవసరం. సర్పంచ్‌లు గ్రామానికి ఆమోదయోగ్యమైన పనులు చేస్తూనే ప్రభుత్వం చేసే మంచి పనులకు కూడా అండదండగా నిలబడాలి. గెలిచిన సర్పంచ్‌లలో అధికారపక్షం, ప్రతిపక్షం అన్న తేడాల్లేకుండా ప్రభుత్వం కూడా పెద్దమనసుతో గ్రామాభివృద్ధికి సంపూర్ణంగా సహకరించాలి.తెలంగాణ రాష్ట్రంలో 12,719 గ్రామరాజ్యాలను తీర్చిదిద్దే బాధ్యత గ్రామసర్పంచ్‌లకు వచ్చింది. కొత్త సర్పంచ్‌లు గ్రామరాజ్యాలను ఎట్లా పాలిస్తారో, గ్రామాల పునర్నిర్మాణంలో ఏ రకమైన పాత్ర పోషిస్తారోనని కోట్లాదిమంది ఎదురుచూస్తున్నారు. కొత్తగా వచ్చినవారు చేసే కృషితో గ్రామాల అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. గ్రామరాజ్యాల అభివృద్ధి దేశాభివృద్ధికి ముడిపడి ఉంది.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులు సరిపోతున్నాయా? అసలు గ్రామానికి నిధులను ఏ మేరకు కేటాయిస్తున్నారన్న విషయం కీలకమైనది. తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత గ్రామాల పునర్నిర్మాణం వేగవంతంగా జరుగుతూ ఉంది. ఈ పనిని మరింత ముందుకు తీసుకుపోయే బాధ్యతను సర్పంచ్ తమ భుజస్కంధాలపై వేసుకోవాలి.ఊరిని తీర్చిదిద్దుకునేటప్పుడు ఐదేండ్లలో చేయవలసిన పనులు దానికి సంబంధించిన ప్రణాళికలను ఏ గ్రామానికి ఆ గ్రామం రూపొందించుకోవాలి. గ్రామ సమావేశాలలో అందరి అభిప్రాయాలు తీసుకుని ప్రణాళిక రచించుకోవాలి. గ్రామసభ ఇచ్చిన అభిప్రాయలను, సలహాలను, సూచనలను గ్రామపంచాయితీ సమావేశాల్లో



సావధానంగా చర్చించుకుని అడుగులు వేయాలి. కొన్ని ఆర్థిక అంశాలతో ముడిపడి ఉండవచ్చును. ఆర్థిక అంశాలు కానివీ ఉంటాయి. ఆర్థిక అంశాల విషయంలో ప్రభుత్వాల నుంచి వచ్చేవి ఏ మేరకు సరిపోతాయి? మిగిలిన నిధులలేమిని ఏ విధంగా సమకూర్చుకోవాలో మార్గాలను వెతుక్కోవాలి. గ్రామ పరిసరాలు ఆనుకొని ఏవైనా పరిశ్రమలు ఉంటే వాటి సాయాన్ని తీసుకోవచ్చును. సొంత ఊళ్ళపై ప్రేమ ఉన్నవాళ్ళ దాతృత్వాన్ని తట్టిలేపితే కొన్ని నిధులు వస్తాయి? ముందుగా ఆ ఊరు నుంచి ఎదిగివచ్చిన దేశ విదేశాలలో ఉన్నవారు ఆ ఊరు నుంచి వచ్చినవారు ఏ ఏ రంగాల్లో ఉన్నారో వారందరి పేర్లను రికార్డు చేయాలి. ఇందుకు గ్రామ కార్యదర్శి ఊర్లో చదువుకున్న యువత సాయం తీసుకోవచ్చును. కొత్తగా ఎన్నికైన పాలకవర్గాలు తమ ఊరు నుంచి బైటకు వెళ్లి స్థిరపడ్డ వారితో ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసుకుని వాళ్ల సలహాలు, సూచనలే గాకుండా ఆర్థిక సాయాలు కూడా పొందే అవకాశం ఉంటుంది.కులవృత్తులపై ఆధారపడి జీవించేవాళ్లు లక్షలాదిమంది ఉన్నారు. గ్రామస్థాయిలో నేటి సమాజ అవసరాలకు అవసరమైన పనిముట్లను చేసేవారి వృత్తులను ఆధునీకరించే పని పల్లెలు పునాదిగా జరగాలి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానానికి వృత్తికళల నైపుణ్యాన్ని బోధిస్తే అవి మంచి ఫలితాలను పొందవచ్చు. గ్రామీణ పరిశ్రమలకు చేతివృత్తుల సమూహాలకు ప్రధానంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందినవారిని నిలబెట్టే పనిని చేపట్టాలి. కింది కులాల వారికి సాయం చేస్తూ వారిని సొంతకాళ్లపై నిలిపేందుకు కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు అనేక పథకాలను తెచ్చాయి. అనేక రాయితీలను ఇస్తాయి. వాటిపై గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామశాఖ కార్యదర్శి లోతుగా అధ్యయనం చేయాలి. జిల్లా పరిశ్రమల అధికారుల దగ్గరకు వెళ్లి తమ గ్రామ స్థితిగతులు, గ్రామంలో ఉన్న మానవ వనరులు తెలియజేసి గ్రామాభివృద్ధి ప్రాజెక్టులను తెప్పించే కృషి చేస్తే గ్రామాలకు ఆధునికత సమకూరుతుంది.గ్రామంలో పార్టీల మధ్య, గుంపుల మధ్య, వర్గాల మధ్య ఉండే వైరుధ్యాలను సున్నితంగా జయించాలి. తాను సర్పంచ్‌గా ప్రమాణస్వీకారం చేసిన దగ్గర్నుంచి ఊరంతటినీ ఒకే దృష్టితో చూడాలి. తన ఊర్లో పంటలు, చెరువుల నుంచి వచ్చే జలసంపద పలు రాయితీలకు సంబంధించిన పనుల ద్వారా గ్రామ ఆదాయాన్ని పెంచడంపై దృష్టి పెట్టాలి. ఊర్లో నీటి సంరక్షణ, వన సంరక్షణలో అందరినీ భాగస్వాములను చెయ్యాలి.



రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన అన్ని పథకాల పనితీరు సక్రమంగా అమలు జరిగే విధంగా చూసే కార్యక్షేత్రంగా గ్రామాన్ని తీర్చిదిద్దాలి. గుడి, బడి, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, పశువుల ఆసుపత్రి సంరక్షణలు చూడాలి. గ్రామానికి సంబంధించిన అన్ని పనులను ఊరంతటి కళ్ళు చేసుకుని చూడాలి. గ్రామాన్ని అన్ని విషసంస్కృతుల కాటు నుంచి సంరక్షించాలి. గ్రామాభివృద్ధిలో మహిళల, యువకుల పాత్రను పెంచాలి. అసాంఘిక శక్తులను ఎండగట్టాలి. ప్రజాస్వామ్య సంస్కృతిని పెంచి పోషించే కేంద్రంగా గ్రామాన్ని తీర్చిదిద్దుకోవాలి.. జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ సెక్రెటరీ వడ్డేపల్లి హనుమంతు అన్నారు.

# నర్సాపూర్ గ్రామస్తులు 24 గంటల కరెంట్ రావటంలేదు

### అని రైతులు మొర పెట్టుకోగా రెడ్డిపల్లి సబ్ స్టేషన్ ను అకస్మాత్తుగా తనిఖీ చేసిన మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి.

అక్షర విజేత, హైదరాబాద్ ప్రతినిధి:హరీష్ రావు మాట్లాడుతూరేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు కేవలం 12 గంటల కరెంటు మాత్రమే సరఫరా చేస్తున్నట్టుగా ఉంది నర్సాపూర్ సబ్ స్టేషన్ లో,సునీత లక్ష్మారెడ్డి నేను కలిసి సబ్ స్టేషన్ ను విజిట్ చేయడం జరిగింది. పార్టీ సమావేశానికి వెళ్తుండగా రైతులు కరెంట్ రావడంలేదని ఫోన్ చేస్తే సడన్గా ఆగడం జరిగింది. రెండు గ్రామాల రైతులు రెడ్డిపల్లి, మద్దూరు గ్రామ రైతులు ఫోన్ చేసి మాకు కరెంటు సరిగ్గా రావడంలేదని ఫోన్ చేస్తే మేము ఇక్కడికి సబ్ స్టేషన్ దగ్గర ఆగడం జరిగింది.రేవంత్ రెడ్డి 24 గంటలు కరెంటు ఇస్తమంటున్నాడురెడ్డిపల్లి మద్దూరు గ్రామాల ప్రజలు 12-13 గంటలకు కరెంటు మాత్రమే వస్తుంది. మాకు ఇబ్బంది అవుతుంది నారుబోసే సమయము పొలానికి నారేసే టైం ఇబ్బంది అవుతుందని.. ఫోన్ చేస్తే ఇది నిజమా కాదా అని సమస్య ఏంది అని తెలుసుకుందామని నర్సాపూర్ సబ్ స్టేషన్ కు రావడం జరిగింది. ఇక్కడ లాక్ బుక్ చూస్తే కేవలం 12 గంటల కరెంటు మాత్రమే వచ్చింది.ఇంకొక రోజు చూస్తే సాయంత్రం ఐదు గంటలకు పోయి ఉదయం 3:00 వచ్చింది. అంటే 14 గంటలు మాత్రమే వచ్చింది ఇంకొక రోజు చూస్తే 13 గంటల కరెంట్ వచ్చింది అంటే ఈ విధంగా 12,13 గంటల కరెంటు మాత్రమే వస్తుంది.రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు కరెంటుకు మేమే చాంపియన్, 24 గంటల కరెంటుకు మేమే బ్రాండ్ అంబాసిడర్ అని చెప్పిండు.మరి 12 గంటల కరెంట్ ఎందుకు వస్తుంది నాయనా రేవంత్ రెడ్డి.ఆనాటి కాంగ్రెస్ పాలనలో కరెంటుతో రైతులు ఇబ్బందులు పడ్డారు నేడు కాంగ్రెస్ పాలనలో రైతులు కరెంటుతో ఇబ్బందులు పడుతున్నారు.నాడు ఎరువులకు ఇబ్బందులు పడ్డారు నేటి కాంగ్రెస్ పాలనలో ఎరువులకు ఇబ్బందులు పడుతున్నారు.మేం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తా ఉన్నాం రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వాలి.భట్టి విక్రమార్క మీరు పెద్దపెద్ద మాటలు మాట్లాడడం కాదు,కెసిఆర్ అంటేనే 24 గంటల కరెంటు కు బ్రాండ్ అంబాసిడర్:ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా రైతుల కోసం 24 గంటలు నాణ్యమైన కరెంటు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వం. కానీ మీరు వచ్చిన తర్వాత 12 13 గంటల కరెంటు కూడా రైతులకు రావడం లేదు,ఏది చూసినా సగం సగమే ఉంది రేవంత్ ప్రభుత్వంలో24 గంటల కరెంటు రైతు బంధు, రుణమాఫీ బోనస్ అన్నిట్లో సగం సగం,దమ్ముంటే అసెంబ్లీలో విద్యుత్ సరఫరా మీద చర్చ పెట్టండిప్రతిపక్షాల మీద బురద జల్లడం కాదు, రైతు సమస్యల మీద ప్రజల సమస్యల మీద చర్చ పెట్టండిరైతులకు ఇచ్చిన హామీలు ఎగ్గొటినందుకు భయపడి కారు గుర్తు కనపడే ఎన్నికలు పెడుతలేదు.రేవంత్



రెడ్డి నీకు దమ్ముంటే కో ఆపరేటివ్ ఎన్నికలు పెట్టుఈ ప్రభుత్వమే రైతు వ్యతిరేక ప్రభుత్వం. మేం ఒచ్చి చూసినం అని ఈ అధికారుల మీద చర్యలు తీసుకోకూ రేవంత్ రెడ్డి.నీకు నిజాయితీ ఉంటే రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం

# నెల రోజుల్లో పంచాయతీలకు నిధులివ్వాల్సిందే.!

### కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్

అక్షర విజేత, కరీంనగర్ ప్రతినిధి:కాంగ్రెస్ సర్కార్ కు కేంద్ర మంత్రి బండి సంజయ్ డెడ్ లైన్‌రాష్ట్రంలోని సర్పంచులు,ఉప సర్పంచులంతా కలిసి రావాలి.కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి గ్రామాలకు నిధులొచ్చేదాకా పోరాడతాం.కరీంనగర్ ఎంపీ పరిధిలోని బీజేపీ సర్పంచులను గెలిపించిన 108 గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతా.ఆయా గ్రామాల్లో ఊరికో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తాఆయా పీహెచ్ సీలకు అవసరమైన మెడికల్ ఎక్విప్ మెంట్స్ ను అందజేస్తా.ఆయా సర్కారీ స్కూళ్లలో టాయిలెట్లను ఏర్పాటు చేయిస్తావిద్య, వైద్యానికి నా తొలి ప్రాధాన్యత:9వ తరగతి చదివే విద్యార్థులకు సర్పంచ్ ల ఆధ్వర్యంలో సైకిళ్లను పంపిణీ చేయిస్తాసర్పంచ్ పదవి కాదు మీ ఊరి బాధ్యత:ప్రజలకు కష్టమొస్తే ఆదుకునే తండ్రి బాధ్యత సర్పంచ్ లదేఇతర సర్పంచ్ లకు ఆదర్శంగా ఉండేలా బీజేపీ సర్పంచులు వ్యవహరించాలి.బాసిజం చేస్తే ప్రజల్లో వ్యతిరేకత మొదలైనట్లేఅడ్డగోలు హామీలిస్తే ఇబ్బందుల్లో పడతారు.పార్టీ గుర్తుతో పంచాయతీ ఎన్నికలు నిర్వహించి ఉంటే కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు కూడా వచ్చేది కాదు,కరీంనగర్ ఎంపీ పరిధిలో గెలిచిన బీజేపీ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ హాట్ కామెంట్స్:బీజేపీ మద్దతుతో గెలిచిన 108 మంది సర్పంచులను ఘనంగా సన్మానించిన కేంద్ర మంత్రి.ఉప సర్పంచ్, వార్డు సభ్యులను సైతం సన్మానించిన బండి సంజయ్.రాబోయే నెల రోజుల్లో రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రంలోని సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులతో కలిసి హైదరాబాద్ లో పరేడ్ నిర్వహిస్తామని హెచ్చరించారు. నిధులను మంజూరు చేసిన తరువాతే ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ సాకుతో నిధుల విడుదలలో జాప్యం చేస్తే కాంగ్రెస్ సర్కార్ మెడలు వంచేందుకు పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని అల్టిమేటం ఇచ్చారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ సర్పంచులను గెలిపించిన గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. కరీంనగర్ లోని రేకుర్తి శుభం గార్డెన్స్ లో బీజేపీ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై బీజేపీ మద్దతుతో గెలిచిన సర్పంచులను, ఉప సర్పంచులను, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. సర్పంచ్, ఉప సర్పంచ్ అంటే పదవి కానే కాదు. ప్రజలు మీకిచ్చిన బాధ్యత మాత్రమేనని గుర్తుంచుకోవాలి. ప్రజలకు ఆపదొస్తే, కష్టమొస్తే ఆదుకునే తండ్రి బాధ్యత సర్పంచ్ లదే. డాక్టర్లు, అధికారులతో సత్సంబంధాలు పెంచుకోవాలి. మీ గ్రామ ప్రజలకు ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి ముందుండాలి. చిరునవ్వుతో పలకరించడమే కాకుండా నడక, నడతలో మంచి తనం ఉండాలి. బీజేపీ గ్రామ సర్పంచ్ అంటేడ ఇతర గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు ఆదర్శంగా తీసుకునేలా వ్యవహరించాలి. బాసిజం చేయాలని చూస్తే ప్రజల్లో వ్యతిరేకత మొదలైనట్లేనని గుర్తుంచుకోండి.అడ్డగోలు హామీలిస్తే ఇబ్బందుల్లో పడతారు. గ్రామాల్లో మొదట చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలి. గత రెండేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలకు నయాపైసా ఇయ్యలే. రాబోయే కాలంలో నిధులిస్తుందనే నమ్మకం కూడా లేదు. అంతో ఇంతో నిధులిచ్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేది కేంద్రమే. పార్టీ గుర్తుతో ఎన్నికల్లోకి వెళితే కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఈ విషయం తెలిసే పార్టీ గుర్తులతో సంబంధం లేకుండా పంచాయతీ ఎన్నికలు నిర్వహించి గెలిచిన వాళ్లంతా కాంగ్రెసోళ్లేనని గంప కింద కమ్మేస్తోంది. ఇకపై బీజేపీ సర్పంచులున్న 108 గ్రామాల అభివృద్ధికి నా మొదటి ప్రాధాన్యత. ఇతర గ్రామాలకు ఆదర్శంగా ఆయా గ్రామాలను తీర్చిదిద్దుతా. ఎంపీ లాడ్స్ తోపాటు సీఎస్సార్ ఫండ్స్ తీసుకొస్తా. ప్రతి గ్రామంలో ఒక వాటర్ ప్లాంట్ ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నా. ప్రతి స్కూల్ లో టాయిలెట్లను నిర్మిస్తాం. ప్రతి గ్రామంలో విద్య, వైద్యం నా తొలి ప్రాధాన్యత. అతి త్వరలో 9వ తరగతి చదివే విద్యార్థులకు సర్పంచ్, ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో సైకిళ్లను పంపిణీ చేయిస్తా. ప్రైవేట్ ఆసుపత్రుల్లో లేని పరికరాలను కూడా కరీంనగర్, వేములవాడ, హుజూరాబాద్, హుస్నాబాద్, జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందజేసిన. ఇకపై బీజేపీ సర్పంచ్ లు గెలిచిన గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కోసం అవసరమైన మెడికల్ ఎక్విప్ మెంట్స్ ను అందిస్తా.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా. మేం మెడికల్ ఎక్విప్ మెంట్స్ ను అందించేందుకు సిద్ధంగా ఉన్నా. అయితే తగిన సిబ్బందిని నియమించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఈ రాష్ట్ర ప్రభుత్వానికి డెడ్ లైన్ ఇస్తున్నా. రాబోయే నెల రోజుల్లో గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయాలి. ఎలక్షన్ కోడ్ రాక ముందే నిధులు రిలీజ్ చేయాలి. ఆ తరువాతే ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లోకి వెళ్లాలని డిమాండ్ చేస్తున్నా. ఎన్నికల సాకుతో తప్పించుకోవాలనుకుంటే మాత్రం బీజేపీ పక్షాన తగిన గుణపాఠం చెబుతాం. కాంగ్రెస్ సర్కార్ ను నిద్రపోనివ్వం. ప్రభుత్వ మెడలు వంచి పంచాయతీలకు నిధులిచ్చేదాకా పోరాడతాం. గత కేసీఆర్ ప్రభుత్వం కేంద్ర నిధులను డైవర్ట్ చేసి పంచాయతీలను సర్వనాశనం చేసింది. ఈసారి ఆ పరిస్థితి రాకూడదంటే కేంద్ర నిధులతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా పంచాయతీలకు నిధులిచ్చేదాకా పోరాడతాం. ఈ విషయంలో బీజేపీతోపాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ బలపర్చిన సర్పంచులు కూడా కలిసి రావాలని కోరుతున్నా. సర్కార్ మెడలు వంచి నిధులు తీసుకొచ్చే బాధ్యతను రామచంద్రరావు నాయకత్వంలో బీజేపీ తీసుకుంటుంది. బీజేపీ సర్పంచులన్న గ్రామాలతోపాటు మిగిలిన గ్రామాల అభివృద్ధి విషయంలోనూ సహకరిస్తా. ఆయా గ్రామాల్లో గెలిచిన సర్పంచులు సైతం ఇగోలను పక్కనపెట్టి అభివృద్ధి విషయంలో కలిసి రావాలి. బీజేపీ పక్షాన గెలిచిన సర్పంచులు సైతం తమ గ్రామాల్లో ప్రత్యర్థి పార్టీలు బలపర్చిన అభ్యర్థులను కలుపుకుపోవాలి. అందరూ కలిసి గ్రామాలను అభివృద్ధి చేయడమే



లక్ష్యంగా పెట్టుకోవాలి. గెలిచిన వాళ్లే కాదు,పార్టీ కోసం పోటీ చేసి ఓడిపోయిన నాయకులకు కూడా అభినందనలు చెబుతున్నా. పార్టీ బలపర్చిన అభ్యర్థులంతా గెలిపించుకునేందుకు పార్లమెంట్ కు వెళ్లకుండా అమిత్ షా నుండి అనుమతి తీసుకుని కరీంనగర్ లో మకాం వేసి ఏం చేశానో మీకు తెలుసు. కొంత మంది కార్యకర్తలు పోటీ చేయాలంటే నామినేషన్ వేయడానికి కూడా పైసల్లేని పరిస్థితి. అయినా 500 పంచాయతీల్లో పోటీ చేసి బీజేపీ ఉనికి చాటారు. ఓడినపప్పటికీ వాళ్ల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో అభివృద్ధి నిధులు వెచ్చిస్తానని మాట ఇస్తున్నా. చివరగా నేను చెప్పేదొక్కటే. గెలిచాక సర్పంచుల ప్రవర్తనలో మార్పు రావొద్దు. ప్రజలను చిరునవ్వుతో పలకరిస్తూ వారి సమస్యల పరిష్కారానికి క్రుషి చేయాలని కోరుతున్నా.



# రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

**- తిగుల్ పిహెచ్ సి ఆకస్మిక తనిఖీజిల్లా కలెక్టర్ హైమావతి**





అక్షర విజేత గజ్వేల్ :
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హాస్పిటల్ కు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ హైమావతి వైద్య సిబ్బందికి ఆదేశించారు. బుధవారం జగదేవపూర్ మండలం తిగుల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా హాస్పటల్ సంబంధించిన రికార్డులను పరిశీలించారు.అనంతరం ఆస్పత్రిలో జరుగుతున్న అభివృద్ధి మరమ్మత్తు పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హాస్పటల్ చుట్టూ ఉన్నటువంటి పిచ్చి మొక్కలను తొలగించాలని ఆదేశించారు.హాస్పిటల్ అభివృద్ధి మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. హాస్పిటల్ మరమ్మత్తు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే సదరు కాంట్రాక్టు పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే హాస్పిటల్ కి వచ్చే రోగులకు వైద్యులు మెరుగైన వైద్యం అందించాలని రోగుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని వైద్య సిబ్బందికి ఆదేశించారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

మహిళ సర్పంచ్ గా గెలవడం సంతోషామని, మహిళ సర్పంచ్ గా గ్రామాభివృద్ధికి కృషి చేయాలని మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకరావాలని జిల్లా కలెక్టర్ హైమావతి గ్రామ సర్పంచ్ రజితకు సూచించారు. మహిళగా సర్పంచ్ గెలవడం సంతోషామని, గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. హాస్పిటల్ లో పారిశుధ్య నిర్మూలన చర్యలు తీసుకోవాలని కోరారు.

మంత్రి దృష్టికి తీసుకెళ్లండి

తిగుల్ ప్రాదమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబఉంచుకోవాలనిఉందని, సిబ్బంది కొరత లేకుండా చూడాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు బట్టు దయానంద్ రెడ్డి జిల్లా కలెక్టర్ హైమావతి దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కలెక్టర్ స్పందిస్తూ వైద్య సిబ్బంది కొరత ఉంటే సంబంధిత రాష్ట్ర మంత్రి దృష్టికి తీసుకపోవాలని చెప్పారు. అనంతరం దయానంద్ రెడ్డి మాట్లాడుతూ బాధ్యత గల జిల్లా కలెక్టర్ ఇలా సమాధానం ఇవ్వడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యుడు రాజశేఖర్, సర్పంచ్ రజిత, వైద్య సిబ్బంది నారాయణ, నీరజ, గ్రామ నాయకులు ఐలయ్య, పరశు రామ్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ ల ఫోరం, కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపిన వంటేరు ప్రతాప్ రెడ్డి.



అక్షర విజేత గజ్వేల్ :
గజ్వేల్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎన్నుకోబడిన కుకునూరుపల్లి మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్ష కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపిన గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ వంటేరు ప్రతాప్ రెడ్డి. గజ్వేల్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కుకునూరుపల్లి మండలంలోని సర్పంచ్ లు అందరీ ఆమోదంతో కుకునూరు పల్లి మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షునిగా ఆకుల భద్రప్పను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.కుకునూరు పల్లి మండల సర్పంచ్ ల ఫోరం ఉపాధ్యక్షుడు మల్లం కనకవ్వ ఐలయ్య, కన్యమైన సంపత్,ప్రధాన కార్యదర్శి బూడిద రమేష్ గౌడ్,కార్యదర్శి దమ్మక్కపల్లి కరుణాకర్,క్యాషియర్ బురుగు మధుమోహన్,కార్యదర్శి తూం శ్రీకాంత్,సలహాదారులు సోమీ రేణుక భగవంతు,ప్రచార కార్యదర్శి సున్నం సుదర్శన్,కార్యవర్గ సభ్యులుగా రెడ్డమైన రాధిక, బచ్చలి శ్రీలత మహిపాల్, పిట్ల మంజుల రాములు దబ్బుట భాస్కర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి కుకునూర్ పల్లి మండల సర్పంచులందరూ గ్రామాల అభివృద్ధిలో ముందు వరుసలో ఉండాలని గ్రామానికి ఆదర్శంగా ఉండి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తీర్చుతూ గ్రామాల అభివృద్ధిలో పోటీ పడుతూ అభివృద్ధి చేయాలని ఆదర్శ గ్రామాలుగా గ్రామాలను తయారు చేయాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, మాజీ పిఏసిఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, మాజీ ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోలా, సద్గుణ రవి, బి ఆర్ఎస్ సీనియర్ నాయకులు లక్ష్మణ్ రాజు,మాజీ సర్పంచ్ కనకయ్య,కోల శ్రీనివాస్,ఉప సర్పంచ్ నాగరాజు, ఉప సర్పంచ్లు నాయకులు అహ్మద్, గణేష్,స్వామి కర్ణాకర్,చరణ్ తదితరులున్నారు.



# బాలికల ఆశ్రమ పాఠశాలల్లో కంటి పరీక్షలు,వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యాధికారులు.

అక్షర విజేత, బజార్ హత్నూర్ ప్రతినిధి.
ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలంలోనీ మడగూడ బాలికల ఆశ్రమ పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినులకు కంటి పరీక్షలు,వైద్య పరీక్షలు నిర్వహించగా,249 మందికి కంటి పరీక్షలు చేయగా,అందులో ఆరుగురు విద్యార్థినులకు ,దృష్టి లోపము ఉన్నట్లు, గుర్తించి వారిని కంటి అద్దాలు వ్రాసి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు భాస్కర్ రావు, పి హెచ్ సి వైద్యదికారి డాక్టర్ భీమ్రావు,మరియు వైద్య సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో ఉన్న పోలీసు హెూంగార్డ్ పై దాడి

అక్షర విజేత:చిగురుమామిడి:
కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో మంగళవారం రాత్రి పోలీసులపై దాడి ఘటన చోటుచేసుకుంది. బ్లూ కోల్ట్స్ విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ విజేందర్,హెూంగార్డ్ రఘురామరాజు డయల్ 100 కాల్‌కు స్పందించి వివాదాన్ని పరిష్కరించి తిరిగి వెళ్తుండగా,బస్టాండ్ సమీపంలో దంపతుల గొడవను గమనించారు. ఈ సందర్భంగా పరిస్థితిని నమోదు చేయడానికి హెూంగార్డ్ ప్రభుత్వ ట్యాబ్‌లో వీడియో తీసేందుకు ప్రయత్నించగా, ఆగ్రహించిన భర్త సందేబోయిన సతీశ్ కర్రతో హెూంగార్డ్ రఘురామరాజు పై దాడి చేయగా తలకు గాయాలయ్యాయి.ఘటనలో ప్రభుత్వ ట్యాబ్ ధ్వంసమైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఏఐటీయుసి కార్మిక సంఘంలో చేరిన అమాలి కార్మికులు



అక్షర విజేత గజ్వేల్ :
సిద్దిపేట జిల్లా జగదేకపూర్ మండలం దౌలాపూర్ గ్రామంలో ఏఐటియుసి జిల్లా కౌన్సిల్ సభ్యులు శివలింగ్ కృష్ణ ఆధ్వర్యంలో దౌలాపూర్ అమాలి కార్మికులు ఏఐటియుసి సంఘంలో చేరారు వారికీ సభ్యత్వం కార్డులు ఇచ్చి సంఘంలో కి ఆహ్వానించడం జరిగినది.ఈ సందర్బంగా మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చినటువంటి నాలుగు లేబర్ కోర్లను తక్షణమే రద్దు చేయాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులుస్వర్గం రాజేశంజిల్లా నాయకులు బొడ్ల సాయి దౌలాపూర్ గ్రామ సర్పంచ్ కృష్ణ ,హైకోర్టు న్యాయవాది, శ్రీనివాస్ గ్రామ ఉపసర్పంచ్ వార్డ్ మెంబర్లు నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.



# దేగామ గ్రామంలో ఘనంగా పేసా కమిటీ సమావేశం

.అక్షర విజేత, బోథ్ ప్రతినిధి:ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలంలోని ఏజెన్సీ ప్రాంతమైన దేగామ గ్రామంలో పేసా కమిటీ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రామ పెద్దలు, పేసా కమిటీ సభ్యులు, ఆదివాసీ నాయకులు, గ్రామ గిరిజనులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పేసా కమిటీ ఉపాధ్యక్షులు ఉయికే సుదర్శన్ మాట్లాడుతూ, గ్రామాల్లో నివసిస్తున్న ఆదివాసుల సాంప్రదాయాలు, ఆచారాలు, సంస్కృతికి ఎటువంటి ఆటంకం కలగకుండా పరిరక్షించాల్సిన బాధ్యత అందరిదని అన్నారు. ఆదివాసుల జీవన విధానానికి భంగం కలిగించే విధంగా ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకూడదని, పేసా చట్టం ద్వారా గ్రామసభకు కల్పించిన అధికారాలను సక్రమంగా అమలు చేయాలని సూచించారు.గ్రామాభివృద్ధి పేరుతో ఆదివాసుల హక్కులు దెబ్బతినకూడదని, భూములు, అటవీ వనరులు, నీటి వనరులపై ఆదివాసులకే ప్రధాన హక్కులు ఉంటాయని పేసా చట్టం స్పష్టంగా చెబుతోందని ఆయన వివరించారు. ప్రతి గిరిజనుడు పేసా చట్టంపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.అనంతరం గ్రామంలోని ఆదివాసుల అవసరాల కోసం ఆదివాసీ సంఘ భవనం ఏర్పాటు చేయాలనే తీర్మానాన్ని పేసా కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా రూపొందించిన తీర్మాన పత్రాన్ని పంచాయతీ అధికారుల సమక్షంలో ఉపసర్పంచ్ బొడ్డు భోజ రెడ్డి గారికి అధికారికంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో పేసా మొబలైజర్ తొడసం ఊర్మిళ, గ్రామ పటేల్ తొడసం గంగారాం, ఉయిక గోపీచంద్, అర్క సత్యనారాయణ, సిడం రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వమే

**- మాజీ మంత్రి హరీష్ రావు**



అక్షర విజేత, నర్సాపూర్ ప్రతినిధి:ముందు ముందు రానున్నది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని బిఆర్ఎస్ సర్పంచులు, నాయకులు ఎవరు అధైర్యపడవద్దని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. డివిజన్ కేంద్రమైన నర్సాపూర్ పట్టణంలో ఎమ్మెల్యే సునీత రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ రేవంత్ రెడ్డికి టిఆర్ఎస్ పార్టీని విమర్శించడం తప్ప పని చేయడం చేతకావడం లేదన్నారు. కేంద్రం నుండి గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు నేరుగా మీకే వస్తాయని ఆ డబ్బులతో గ్రామాభివృద్ధికి పాటుపడాలని నూతనంగా ఎన్నికైన సర్పంచులకు ఆయన సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని దొంగ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తుందన్నారు. రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ఎవరు అధైర్యపడవద్దని ఆయన చెప్పారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ మాజీ మంత్రి హరీష్ రావుల మీదున్న అభిమానంతో మనకు ఓట్లేసారని ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామఅభివృద్ధికిపాటుపడాలన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన బిఆర్ఎస్ పార్టీ సర్పంచులను మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే సునీత రెడ్డిలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిఆర్ఎస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, నూతనంగా ఎన్నికైన సర్పంచులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు

# అనుమతి లేకుండా ఉన్నటువంటి అడ్వర్టైజ్మెంట్ హెూర్డింగ్స్ తొలగింపు.

**యాచారంలో 93 అడ్వర్టైజ్మెంట్ హెూర్డింగ్స్ తొలగించిన గ్రామపంచాయతీల సిబ్బంది.**



అక్షర విజేత, ఇబ్రహీంపట్నం :-
రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి ఆదేశానుసారం యాచారం మండలంలోని గ్రామపంచాయతీ అనుమతి లేకుండా ఉన్నటువంటి అడ్వర్టైజ్మెంట్ హెూర్డింగ్ లను కొన్ని బుధవారం తొలగించారు. మిగతావి కూడా పూర్తి స్థాయిలో రెండు రోజుల్లో తొలగించాలి అని పంచాయతీ కార్యదర్శిలకి ఆదేశాలు జారిచేశారు. బుధవారం వివిధ గ్రామాలలో తొలగించిన అడ్వర్టైజ్మెంట్ హెూర్డింగ్స్ వివరాలు గ్రామ పంచాయతీ వారీగా ఈ కింది విధంగా ఉన్నాయి. చింతపట్ల 6, చౌదర్ పల్లి 3, గున్ గల్ 18, మాల్ 2, మేడిపల్లి 2, మొండి గౌరెల్లి 1, నల్లవెల్లి 1, నంది వనపర్తి 3, తక్కలపల్లి 20, తక్కలపల్లి తండా 3, తమ్మలోని గూడ 18, యాచారం 15, యాచారం మండలంలోని మొత్తం 93 అడ్వర్టైజ్మెంట్ హెూర్డింగ్స్ తొలగించారు



# మామిడ్యాల సర్పంచ్ ఎడ్ల పోచయ్యకు ఘన సన్మానం

అక్షర విజేత గజ్వెల్
కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సర్పంచ్ గా గెలిచిన ఎడ్ల పోచయ్యకు ఇందిరమ్మ కమిటీ మెంబర్ నల్ల వినోద్ కుమార్, క్షీరసాగర్ వార్డ్ మెంబర్ సత్యనారాయణ సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీలో నాయకులకు,కార్యకర్తలకు మంచి గుర్తింపు ఉంటుందని వారు తెలియజేశారు.సిద్దిపేట జిల్లా ములుగు మండలం మామిడ్యాల గ్రామ సర్పంచ్ గా గెలిసిన ఎడ్ల పోచయ్యకు బుధవారం సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడ్యాల గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా చేయడమే లక్ష్యం గ్రామ ప్రజల ఐక్యతతో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టి పారదర్శక పరిపాలనతో గ్రామాభివృద్ధికి సేవ చేయాలని సూచించారు. గ్రామాల్లో మౌలిక వసతులు, రహదారులు,తాగు నీరు, విద్యా, ఆరోగ్య రంగాల్లో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించేందుకు సర్పంచ్లు కీలక పాత్ర పోషించాలన్నారు. అందరికీ విద్యా వంటి



అన్ని రంగాలలో గ్రామ అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు సాగాలని సూచించారు.

# బీజేపీ ప్రజా ప్రతినిధులను సన్మానించిన బండి సంజయ్



చిగురుమామిడి
భారతీయ జనతా పార్టీ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని గ్రామపంచాయతీలలో గెలిసిన సర్పంచ్,ఉప సర్పంచ్,వార్డు సభ్యులను కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా చిగురుమామిడి మండలంలోనీ గ్రామాలలో గెలిచిన సర్పంచ్,ఉప సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడీ కృష్ణ రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి,మండల అధ్యక్షులు పోలోజు సంతోష్,జిల్లా కార్యవర్గ సభ్యులు చెప్యాల మురళి మనోహర్, ఉపాధ్యక్షులు కంది శంకర్, గునుకులపల్లె సర్పంచ్ గునుకుల మధుసూదన్ రెడ్డి,ఉప సర్పంచ్ గునుకుల లత, రేకొండ ఉప సర్పంచ్ బిళ్ళ సంతోష్ రెడ్డి, బీజేపీ వార్డు సభ్యులు, ఇతర నాయకులు పాల్గొన్నారు




# అభివృద్ధి బాట పట్టిన పుల్కల్ సర్పంచ్ లావణ్య- కృష్ణారెడ్డి

### -: సొంత నిధులతో2 మంచినీటి బోర్లు వేయించిన సర్పంచ్

### -: హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామ ప్రజలు




పుల్కల్ (ప్రతినిధి)

ఈనెల 22న పదవీ బాధ్యతలు చేపట్టిన పుల్కల్ గ్రామ సర్పంచ్ లావణ్య కృష్ణారెడ్డి బాధ్యతలు చేపట్టిన రెండు రోజులకే గ్రామంలోని ఆరో వార్డులో తీవ్ర మంచినీటి సమస్య ఉండడంతో విషయం తెలుసుకున్న ఆమె వెంటనే స్పందించి తమ సొంత నిధులతో అట్టి వార్డులో బుధవారం నాడు మంచినీటిబోలును వేయించారు అట్టి బోరులో నీరు బాగా రావడంతో అవార్డు ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు అంతేకాకుండా గ్రామ నడి బొడ్డులో ఉన్న బీరప్ప దేవాలయం వద్ద మరో మంచినీటి బోరుబావిని వేయించారు దీంతో గ్రామ ప్రజలు తీవ్ర హర్ష భావం వ్యక్తం చేస్తున్నారు అంతేకాకుండా గ్రామంలోని ప్రధాన మురికి కాలువ కొన్ని నెలల నుండి అట్టి కాలువ నిండి మురుగువాసనతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అట్టి విషయాన్ని తెలుసుకున్న గ్రామ సర్పంచ్ లావణ్య తమ సొంత ఖర్చులతో అట్టి మురుగును శుభ్రం చేయించారు అనంతరం ఆమె మాట్లాడుతూ తమ గ్రామ అభివృద్దె తమ ధ్యేయమన్నారు తమ గ్రామ అభివృద్ధి కోసం తాము అహర్నిశలు కృషి చేస్తామన్నారు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల బాగోగులను ఎప్పటికప్పుడు చూసుకునే బాధ్యత తమపై ఎంతైనా ఉందన్నారు తమపై నమ్మకంతో తమకు ఓట్లు వేసి గెలిపించిన గ్రామ ప్రజలకు తాము ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు పుల్కల్ గ్రామాన్ని అంచలంచెలుగా అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే దృఢనిచయంతో తాము రాజకీయాల్లోకి వచ్చామన్నారు. కావున గ్రామ ప్రజలు తమకు సహకరిస్తే గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు ఈ కార్యక్రమంలో. గ్రామ ఉపసర్పంచ్ ప్రవీణ్ .వార్డు సభ్యులు కని గేరి మల్లేశం .మాజీ సర్పంచ్ శ్రవణ్ కుమార్ .మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ చారి. బి ఆర్ ఎస్ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మల్లక్‌పల్లి గ్రామంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



ఉమ్మడి వరంగల్ జిల్లా డిసెంబర్ 24

మల్లక్‌పల్లి గ్రామంలో క్రిస్మస్ వేడుకలను కృప ప్రార్థన మందిరం సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెవ. పాస్టర్ తాటికాయల శ్రీనివాస్ పాల్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ గిన్నారపు లత రామస్వామి, 12వ వార్డు సభ్యుడిని సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం సర్పంచ్ లత రామస్వామి, ఉపసర్పంచ్ కానురి రాజు చేతుల మీదుగా కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్ష కార్యదర్శులు బైరపాక ఏలీయా, గిన్నారపు రవి, ఎం.పి.టి.సి భీంరెడ్డి కర్ణాకర్ రెడ్డి, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కటుకూరి సుధాకర్, కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్, సంఘ నాయకులు బైరపాక రమేష్, తాటికాయల వెంకటస్వామి పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు ఆమంచ మాధవి, దర్శనల నవీన్, బైరపాక యాదగిరి, దాసరి సుష్మా, నారబోయిన హరికృష్ణ, ఇదెలా విజయ, ఎం.డి. సమీరా, గ్రామ నాయకులు తాటికాయల కొమురయ్య, తాటికాయల ఎల్లయ్య, తాటికాయల డేవిడ్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు కేక్ పంచిపెట్టారు. కార్యక్రమం అనంతరం అంబేద్కర్ విగ్రహానికి సర్పంచ్ లత రామస్వామి, గ్రామ నాయకులు పూలమాల వేసి నివాళు లర్పించారు. అలాగే గ్రామ బొడ్రాయికి కొబ్బరికాయలు కొట్టి గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఇరుముడి కట్టి శబరిమలైకి



జోగిపేట)

జోగిపేట్ బుధవారం అయ్యప్ప స్వాములు అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఇరుముడి కట్టుకొని అయ్యప్ప స్వామియే శరణమంటూ అయ్యప్ప ఆలయంలో పూజలు చేసి ఇరుముడు కట్టుకొని అన్నదాన ప్రసాదం నిర్వహించి శబరిమలైకి బయలుదేరారు 41 రోజుల పాటు నిష్ట నిలయంతో భక్తి శ్రద్ధలతో బయలుదేరారు మండలం చెందిన గొల్ల శ్రీనివాస్ స్వామి ధర్మన్నారు గ్రామానికి చెందిన అనిల్ రెడ్డి స్వామి ఎర్రారం గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్ స్వామి తోపాటు మొత్తం 8 మంది అయ్యప్ప స్వాములు ఇరుముడి కట్టుకున్నారు స్వాములను వీడ్కోలు పలకడానికి మాజీ డిసిసిబి వైస్ చైర్మన్ పి జైపాల్ రెడ్డి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగభూషణం మల్లికార్జున్ గుప్తా ఆందోల్ మండల టిఆర్ఎస్ నాయకుడులు లక్ష్మి కాంత్ రెడ్డి లింగాగౌడ్ చాపల వెంకటేశం అర్జునయ్య వసంత్ రెడ్డి మహేష్ యాదవ్ వీరన్న నరసింహారెడ్డి అశోక్ తదితరులు భక్తులు పాల్గొన్నారు

# కడవేర్గు గ్రామంలో సినిమా చిత్రీకరణ



చేర్యాల,డిసెంబర్25(

సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం కడవేర్గు గ్రామంలో బుధవారం సినిమా చిత్రీకరణ జరిగింది.ప్రముఖ పర్యావరణ వేత్త,సామాజిక కార్యకర్త వనజీవి రామయ్య(దరిపల్లి రామయ్య)గారి జీవిత చరిత్రను ఆధారంగా తీస్తున్న సినిమా కడవేర్గు గ్రామంలో షూటింగ్ జరుగుతున్న సందర్భంగా ప్రముఖ సీనియర్ సినీ నటుడు బ్రహ్మాజీ,దర్శకుడు వేముగంటి గారిని సిపిఎం సిద్ధిపేట జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఆముదాల మల్లారెడ్డి శాలువాలతో సన్మానం చేశారు.ఈ సన్మాన కార్యక్రమంలో సిపిఎం చేర్యాల మండల కార్యదర్శి బండకింది అరుణ్,జిల్లా కమిటి సభ్యులు దాసరి ప్రశాంత్,చేర్యాల పట్టణ నాయకులు తుప్పతి రాజు,వారితో యాదయ్య,తదితరులు పాల్గొన్నారు.

# మూగజీవాలకు నట్టలమందు ఎంతో ఉపయోగకరం

### -పశు వైద్యాధికారి. కీర్తి



పుల్కల్ (ప్రతినిధి)

రైతులు పోషిస్తున్న మూగజీవాలైన గొర్రెలు. మేకలకు నట్టల మందులు .తప్పకుండా వేయించుకోవాలని పశువైద్యాధికారి కీర్తి అన్నారు. బుధవారం నాడు మండల కేంద్రమైన పుల్కల్ లో పలు రకాల గొర్రెలకు మేకలకు నట్టల మందులను వేయడం జరిగిందన్నారు ముందు జాగ్రత్త చర్యగా తమ మూగజీవాలకు ఎలాంటి రోగాలు రాకుండా ఈ మందులు ఎంతగానో ఉపయోగపడతాయని పశు వైద్యాధికారి కీర్తి అన్నారు అనంతరం ఆమె మాట్లాడుతూ మూగజీవాల పట్ల రైతులు ఏమాత్రం అశ్రద్ధ వహించకుండా ఏ మూగజీవాలైన రోగాల బారిన పడితే రైతులు వెంటనే తమ పశువులను తీసుకొని మండల కేంద్రంలో ఉన్న పశు వైద్య కేంద్రానికి తీసుకురావాలని ఆమె రైతులకు సూచించారు ప్రతిరోజు తమ వైద్య సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటుందన్నారు కావున రైతులు పశు వైద్య కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లావణ్య కృష్ణారెడ్డి. ఉప సర్పంచ్ ప్రవీణ్ .మాజీ సర్పంచ్ .శ్రావణ్ కుమార్ మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ చారి ఎల్ ఎస్ సి రాజు. గ్రామ పశుకాపరులు రైతులు పాల్గొన్నారు



# సింగితం గ్రామాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దడమే నా లక్ష్యం

### - ప్రమాణస్వీకారంలో సర్పంచ్ శ్రావణి నిరంజన్

రాయికోడ్ 24డిసెంబర్)

సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం సింగితం గ్రామ సర్పంచ్ గా సోమవారం నాడు అధికారుల సమక్షంలో ప్రమాణస్వీకారం చేసిన సర్పంచ్ శ్రావణి నిరంజన్ మరియు వార్డ్ మెంబర్లు నిరంజన్ మాట్లాడుతూ మునుపెన్నడు లేనివిదంగా గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని అన్నారు, గ్రామస్తుల అందరి సహకారంతో, పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందరికి అందేవిదంగా చూస్తానని అన్నారు.అందరికి అన్నివేళలా అందుబాటులో ఉంటానని నా గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పీజీ మహేష్,వార్డ్ మెంబర్లు, యువ నాయకులు పట్లోళ్ల ప్రశాంత్ పాటిల్, గౌస్,మాజీ వైస్ ఎంపీపీ శామ్, ఆగమయ్య, అనిల్ చారీ, రామకృష్ణ, దోసపల్లి ప్రభాకర్, మొగులయ్య, మనోజ్ మరియు యువకులు,నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ ఉప సర్పంచ్ వర్డ్ మెంబర్లకు పదవి ప్రమాణ స్వీకారం చేయించిన పంచాయతీ కార్యదర్శి రమేష్, ఏఈ ప్రియ



రేగోడ్

రేగోడ్ మండలం లోని మర్పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్, ఏఈ ప్రియ, అధ్వర్యంలో సర్పంచ్ చాకలి నాగలక్ష్మి నర్సింలు, ఉప సర్పంచ్ బేగరి వీరమ్మ, వర్డ్ మెంబర్లు ప్రమాణం చేసి పదవి బాధ్యతలు చేపట్టినారు. నూతనంగా ప్రమాణం చేసిన సర్పంచ్ చాకలి నాగలక్ష్మి నర్సింలు, ఉప సర్పంచ్ బేగరి వీరమ్మ కు, వర్డ్ మెంబర్లకు పంచాయతీ కార్యదర్శి రమేష్ శాలువాతో సన్మానం చేసి పలు సూచనలు చేశారు.క్రమం తప్పకుండా నెలకు నిర్వహించే సమావేశాలకు రావాలని కోరారు. రెండు నెలలకు ఒక్కసారి నిర్వహించే గ్రామసభ సమావేశాలకు రావాలని కోరారు.ప్రభుత్వం పెట్టబడిన పథకాలపై అవగాహన ఉండాలి అర్హులైన వారికి అందించే విధంగా కృషి చేయాలని అన్నారు.ఈ సమావేశ కార్యక్రమానికి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోయిని అంజయ్య,భద్రరెడ్డి,కమ్మరి కుమార్, రామకృష్ణ,రవి,తదితర గ్రామ పెద్దలు పాల్గొని పదవి బాధ్యతలు చేపట్టిన సర్పంచ్ నాగలక్ష్మి నర్సింలు, ఉప సర్పంచ్ బేగరి వీరమ్మ, వర్డ్ మెంబర్లకు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు


# నూతన సర్పంచ్‌లకు సన్మానం



రాయికోడ్ 24 డిసెంబర్)

రాయికోడ్ మండలం లోని ఇటికెపల్లి సర్పంచ్ గా ఎన్నికైన తమ్మలి రాజు ను బిఆర్ఎస్ పార్టీ నాయకులు తిరుమల శ్రీకాంత్ శాలువా పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు,మొదటి సారి సర్పంచ్ బరిలో నిలిచి సర్పంచ్ గా ఎన్నికైనా రాజు సేవా దృక్పధం తో ఉంటారని అభిప్రాయ పడ్డారు.అంతకుముందు ఖాంజమాల్ పూర్ సర్పంచ్ నరేష్ మిత్రులు పీపడపల్లి మోహన్, ప్రవీణ్ లతో కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.


# నూతన వస్త్ర పుష్పలంకరణ వేడుకలో పాల్గొన్న వాడబలిజ యూత్ నాయకులు



వాజేడు)

వాజేడు మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో బుధవారం గార సతీష్. విజయలక్ష్మి దంపతుల కుమార్తె దివ్యశ్రీ పుష్పలంకరణ వేడుకలో పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమంలో వాడబలిజ సేవా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గార తిరుపతి మండల కోశాధికారి పానేం సురేష్ గార జనార్ధన్ అల్లి అరవింద్ ఏలేటి రవి రొడ్డ రాంప్రసాద్ పాల్గొన్నారు

# క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్



జోగిపేట)

జోగిపేట్ ఆందోల్ నియోజకవర్గం క్రైస్తవ సోదరీ సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ క్రిస్టమస్ పండగ ప్రేమ శాంతి కరుణ సేవ భావాలను సమాజానికి అందిస్తున్నదన్నారు ఏసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరి జీవితంలో పూర్తిగా నిలవాలని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఐక్యమాత్రంతో జీవించాలని ఈ పండుగ అందరి జీవితాల్లో ఆనందం ఆరోగ్యం సంశుద్ధి తీసుకురావాలనీ క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపారు.

# ఎర్ధనూర్ గ్రామ పంచాయతీ సర్పంచి పంబల జ్యోతి దుర్గ ప్రసాద్ లను సన్మానించిన ఎస్సీ ఎస్టీ కమిషనర్ చైర్మన్ బక్కి వెంకటయ్య



జోగిపేట్

సంగారెడ్డి జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యను ఏర్ధనూర్ గ్రామ సర్పంచ్ పంబల జ్యోతి దుర్గాప్రసాద్ బుధవారం సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరిషత్ పంకోజ్ అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ మర్యాదపూర్వంగా సన్మానించడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో డిపి శంకర్ రవీందర్ సదానంద్ ఏపీఎంఏ వెంకట్ తదితరులు పాల్గొన్నారు

# శ్రీ కృష్ణవేణి హై స్కూల్, అల్లిపూర్ బ్రాంచ్‌లో ప్రీ-క్రిస్మస్ వేడుకలు



జహీరాబాద్)

విద్యాసంస్థల చైర్మన్ వెదిరే అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ కృష్ణవేణి హై స్కూల్, లో ప్రీ%-%క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ముఖ్య అతిథిగా పాస్టర్ అరుణ్ కుమార్ హాజరై క్రిస్మస్ పండుగ యొక్క ప్రేమ, శాంతి సందేశాన్ని వివరించారు. ప్రిన్సిపాల్ వసిష్ట రెడ్డి క్రిస్మస్ పండుగ మానవత్వం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన మెరి మాత, జోసెఫ్, గొల్లాళ్లు, రాజులు, జ్ఞానులు నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కరుణాలయానికి 50 కేజీల బియ్యం డొనేషన్ చేసిన-రిపోర్టర్ అనిల్ రాజ్

## -క్రిస్మస్ పవిత్ర పండుగా సందర్భంగా-కీ.శే.,గొల్లపల్లి రాజయ్య-వెంకటమ్మ ల జ్ఞాపకార్థంగా

## -ముఖ్య అతిధిగా కరుణాపురం గ్రామ సర్పంచ్ గుర్రపు రీనా-ప్రవీణ్




న్యూస్ ఉమ్మడి వరంగల్ జిల్లా డిసెంబర్ 24ధర్మసాగర్ మండలం, కరుణాపురం గ్రామంలోని కరుణాలయానికి రిపోర్టర్ అనిల్ క్రిస్మస్ పండుగా సందర్భంగా తన తాత-నానమ్మ, కీ,శే,,గొల్లపల్లి రాజయ్య-వెంకటమ్మల జ్ఞాపకర్థంగా ఆలయంలోని అనాధపిల్లలకు 50 కేజీల బియ్యం బహుకరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి కరుణాపురం గ్రామ సర్పంచ్ గుర్రపు రీనా-ప్రవీణ్ ముఖ్య అతిధులుగా హాజరైనారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి నారాయణ (రాజయ్య పెద్ద కుమారుడు), ఎం.డీ శంషుద్దీన్ ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడు, చిట్యాల రమేష్ రిపోర్టర్, కందుకూరి అజయ్ చందర్ లెక్చరర్, కందుకూరి ప్రభాకర్ ఎమ్మార్పిఎస్ గ్రామ ఉపాధ్యక్షుడు, ఎం.డి నశిరోద్దీన్, ఫా.సుధాకర్ లు పాల్గొన్నారు.

# జహీరాబాద్ లో బి.ఆర్.ఎస్ పార్టీ బలపర్చిన ఆత్మీయ సత్కార సభ

## -నూతన సర్పంచ్ లు మరియు ఉపసర్పంచ్ లు వార్డు సభ్యులకు సత్కారించిన హరీష్ రావు









జహీరాబాద్ డిసెంబర్ 24,)

జహీరాబాద్ నియోజకవర్గం లో జరిగిన బి.ఆర్.ఎస్ సర్పంచ్ లు ఉప సర్పంచ్ వార్డు మెంబర్ల యొక్క ఆత్మీయ సత్కారం సభలో సంబంధించిన మండలాలు మరియు గ్రామాల యొక్క నూతనంగా ఏర్పడిన పాలక వర్గానికి మాజీ మంత్రి వర్యులు తన్నీరు హరీష్ రావు ముఖ్య అతిథులుగా హాజరైనారు. జహీరాబాద్ అసెంబ్లీ శాసన సభ సభ్యులు కొనింటి మాణిక్ రావు,డి సి ఎం ఎస్ చైర్మన్ శివకుమార్ జహీరాబాద్ నియోజకవర్గం లోని మొగుడంపల్లి,కోహీర్,న్యాల్కల్,ఝరాసంగం,జహీరాబాద్ మండల అధ్యక్షులు మరియు నాయకులు పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం హరీష్ రావు మాట్లాడుతూ నూతనంగా గెలుపొందిన సర్పంచ్ లకు, మరియు ఉప సర్పంచ్ లకు వార్డు మెంబర్లకు శుభాకాంక్షలు తెలియచేసారు,మరియు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి గత రెండు సంవత్సరాలు గడిచిన అభివృద్ధి శూన్యం అని,గత మా బి.ఆర్.ఎస్ ప్రభుత్వంలో 50కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేస్తే వాటిని మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి వెనక్కి తీసుకెళ్లారని ఆయన అన్నారు.జహీరాబాద్ లోని హుగ్గెలి చౌరస్థలో మహాత్మా బసవేశ్వరుని విగ్రహ నిర్మాణానికి నిధులు మేము మంజూరు చేస్తే దాని ఆవిష్కరణ మాత్రం రేవంత్ రెడ్డి చేసారని అలాగే రైల్వే బ్రిడ్జి దగ్గర ఫ్లైఓవర్ కి నిధులు మంజూరు చేసి మేము పని పూర్తి చేయిస్తే దానిని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే ఫ్లైఓవర్ పనులు పూర్తి చేశామని చెప్పుకొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజలను మోసం చేసారని కనుక ప్రజలు కచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్తారని రాబోయే రెండు సంవత్సరాల తరువాత వచ్చేది మళ్లీ కెసిఆర్ ప్రభుత్వమే అని ఆయన జహీరాబాద్ లో జరిగిన ఆత్మీయ సత్కార సభలో అన్నారు.జహీరాబాద్ లో మున్సిపల్ ఎన్నికలకు అందరం తయారు కావాలి ,మున్సిప్ ఎన్నికలో బి ఆర్ ఎస్ జెండా ఎగరవేయాలని ఎల్లవేళల కార్యకర్తలకు అండగా ఉంటామని . క్రిస్మస్ పండుగ సందర్భంగా అందరికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం,జిల్లా నాయకులు నామ రవికిరణ్, మాజీ ఆత్మ చైర్మన్ విజయ్ కుమార్,జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, ఝరసంఘం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, కోహీర్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు, మాజి మున్సిపల్ చైర్మన్ తంజిం,న్యాల్కల్ మండల జెడ్పీటీసీ స్వప్న భాస్కర్,మాజి పట్టణ అధ్యక్షులు మొహియుద్దీన్,యాకూబ్,మాజి కౌన్సిలర్ లు,బండి మోహన్, అబ్దుల్లా,మాజి కేతకీ సంగమేశ్వర ఆలయ చైర్మన్ నరసింహ గౌడ్,మహిళా నాయకులు మంజుల ,సరస్వతి రెడ్డి,బి ఆర్ ఎస్వీ అధ్యక్షులు రాకేష్ , గ్రామ పార్టీ అధ్యక్షులు,అనుబంధ సంస్థల అధ్యక్షులు ,ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు....

# విద్యార్థులు సాధారణ ప్రాజెక్టులే కాకుండా పేటెంట్ స్థాయికి చేరేలా మార్గనిర్దేశం చేయాలి

## .ఎఐసిటిఇ ఉపాధ్యక్షులు, విద్యా మంత్రిత్వ శాఖ ప్రధాన ఇన్నోవేషన్ అధికారి డా.అభయ్ జెరే.






ఇబ్రహీంపట్నం :-గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్ టెక్నికల్ క్యాంపస్‌లో పిఎం షరి ఉపాధ్యాయుల జాతీయ ఐడిఈ బూట్‌క్యాంప్ సదస్సు ఘనంగా ముగిసింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కోసం నిర్వహించిన మూడు రోజుల జాతీయ సదస్సు “ఇన్నోవేషన్ డిజైన్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ (ఐడిఇ) బూట్‌క్యాంప్” అనే అంశం పైన గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్ టెక్నికల్ క్యాంపస్ (జిఎన్ఐటిసి)లో విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమాన్ని పాఠశాల విద్య, సాక్షరత విభాగం, అఖిల భారత సాంకేతిక విద్యామండలి, విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన ఇన్నోవేషన్ సెల్ సంయుక్తంగా నిర్వహించాయి. భారతీయ పాఠశాలలలో ఇన్నోవేషన్ సంస్కృతిని పెంపొందించడంలో ఈ సదస్సు ప్రముఖ పాత్ర పోషిస్తుందని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ నెల 22 నుంచి 24, 2025 వరకు జరిగిన ఈ బూట్‌క్యాంప్‌ను గ్లోబల్ స్థాయిలో ఎంట్రప్రెన్యూర్‌షిప్ విద్యలో ముందున్న వాధ్వానీ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎఐసిటిఇ ఉపాధ్యక్షులు, విద్యా మంత్రిత్వ శాఖ ప్రధాన ఇన్నోవేషన్ అధికారి డా.అభయ్ జెరే పాల్గొని “ఇన్నోవేషన్, సమస్యల పరిష్కారానికి మానవ కేంద్రిత దృక్పథం” అనే అంశంపై మాట్లాడుతూ... పాఠశాల విద్యార్థులు సాధారణ ప్రాజెక్టులకే పరిమితం కాకుండా పేటెంట్ స్థాయి వరకు చేరేలా మార్గనిర్దేశం చేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా అయన సదస్సులో పాల్గొన్న ఉపాధ్యాయులకు మార్గనిర్దేశనం చేశారు. యోగేష్ డి.బ్రహ్మోంకర్, విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్‌లో ఇన్నోవేషన్ డైరెక్టర్, రాష్ట్రస్థాయి ప్రారంభోత్సవానికి ఎఐసిటిఇ సమగ్ర శిక్ష అభియాన్‌కు చెందిన ఉన్నత స్థాయి అధికారులు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ ఇండియా రైసింగ్ పాఠశాలల నుంచి 190కి పైగా మంది ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొని, తమ సంస్థలలో ఇన్నోవేషన్ అంబాసిడర్లుగా మారేందుకు రూపొందించిన ప్రాక్టికల్ వర్క్‌షాప్‌లలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆతిథ్యం ఇవ్వడంలో గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్, గురునానక్ యూనివర్సిటీ నాయకత్వం కీలక పాత్ర పోషించిందని అతిధులు తెలియచేసారు. సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ, జి.ఎన్.యూ చాన్స్‌లర్, జి.ఎన్.ఐ వైస్ చైర్మన్, జాతీయ విద్యా విధానం (ఎన్.ఇ.పి) 2020 దృష్టికోణానికి అనుగుణంగా ఉన్న ఈ జాతీయ కార్యక్రమానికి ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.ఎన్.యూ వైస్ చాన్స్‌లర్, జి.ఎన్.ఐ మేనేజింగ్ డైరెక్టర్ డా.హెచ్.ఎస్. సైనీ, జి.ఎన్.ఐ.టి.సి డైరెక్టర్ డా.ఎస్.శ్రీనాథ రెడ్డి, జి.ఎన్.ఐ.టి.సి ఆర్ అండ్ డి డీన్ డా.ఎస్.వి.రంగనాయకులు, వివిధ విభాగాల అధిపతులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ కమిషనర్ చైర్మన్ బక్కి వెంకటయ్య ను కలిసిన నాయకులు



కోహిర్

సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలోని సజ్జపూర్ గ్రామం లో పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యను గోటిగారు పల్లి బుమయ్య, మహిళా నాయకురాలు మానియర్ పల్లి నర్సమ్మ లు మర్యాదపూర్వంగా కలిసి సన్మానించడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నాయకులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# పాస్తపూర్ లో యేసుక్రీస్తు జన్మదిన సందర్బంగా చినపిల్లల తో నాటకం



జహీరాబాద్ పాస్తపూర్ లో యేసుక్రీస్తు జన్మదిన సందర్బంగా చినపిల్లల తో నాటకం యేసుక్రీస్తు జననం ఏరోదు రాజు గోల్లాలు రావడం యేసుక్రీస్తు బాప్తిస్మము పోదడా% నాటకం నేరిపిన పంతులు కమల్పల్లి ప్రశాంత్ చంద్రయ్య మరియు సంఘ కాపరి రెవ. మోసెస్.లెమెన్ ఎన్. అశోక్ .సురేష్ నాగమ్మా చుక్కమ్మ తదితరులు ఉన్నారు.

# క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు



జహీరాబాద్)

జహీరాబాద్ నియోజకవర్గం క్రైస్తవ సోదరీ సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు క్రిస్టమస్ పండగ ప్రేమ శాంతి కరుణ సేవ భావాలను సమాజానికి అందిస్తున్నదన్నారు ఏసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరి జీవితంలో పూర్తిగా నిలవాలని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఐక్యమాత్రంతో జీవించాలని ఈ పండుగ అందరి జీవితాల్లో ఆనందం ఆరోగ్యం సంశుద్ధి తీసుకురావాలనీ క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజలకు సేవ చేయడమే మా ప్రధాన లక్ష్యం

## -తుమ్మన్ పల్లి లో త్రాగు నీరు కోసం సొంత నిధులతో బోరు వేయించిన శంకర్





ఝరాసంగం

ప్రజలకు సేవ చేయడమే తమ ప్రధాన లక్ష్యం అని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి శంకర్ పారమ్మ అన్నారు.బుధవారం తుమ్మన్ పల్లి గ్రామం లో ఎన్నికల సమయంలో త్రాగు నీరు సమస్య ఉందని గ్రామ ప్రజలు కోరడం తో ఎన్నికల బరిలో కాంగ్రెస్ పార్టీ సపోర్ట్ తో నిలబడి ఓటమి పాలైనప్పటికి మాట కు కట్టుబడి నూతన బోర్ వేసి ప్రజలకు దాహన్ని తీర్చడానికి ముందుకు రావడం తో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హన్మంత్ రావు పాటిల్ మాజీ ఎమ్ పి టి సి శంకర్ ముదిరాజ్ తుమ్మనపల్లి కాంగ్రెస్ గ్రామాకమిటి అధ్యక్షులు తిరుపతి నావాజ్ రెడ్డీ కప్పడ్ మాజి సర్పంచ్ నందప్ప కొల్లూర్ సంగమేశ్వర్ టెంపుల్ డైరెక్టర్ నావాజ్ రెడ్డి మస్తాన్ బోజిరెడ్డి రోషన్ మోసిన్ గంట నర్సిహ్మా రెడ్డి మతీన్ ఎంపల్లి రాజు రవీందర్ రెడ్డీ ఎల్ రెడ్డీ మోహన్ రెడ్డీ ఎల్ రెడ్డీ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా ప్రారంభించిన రాజ్ మోటార్ కార్ వర్క్ షాప్

## -పాల్గొన్న పలువురు ప్రముఖులు





జహీరాబాద్)

జహీరాబాద్ పట్టణం అల్గోల్ బైపాస్ రోడ్ లో ఝరాసంఘం మండలం సంగం కె గ్రామం మాటూర్ రాజ్ కుమార్ నూతనంగా ఏర్పాటు చేసిన రాజ్ మోటార్స్ (మల్టీ బ్రాండ్ కార్ వర్క్ షాప్)ను బుధవారం రోజు సాయంత్రం పలువురు ప్రముఖులు హాజరై ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమం లో స్థానిక ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు,తెలంగాణ రాష్ట్ర ఎస్సి కార్పొరేషన్ మాజీ చెర్మన్ వై.నరోత్తం తెలంగాణ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ మాజీ చైర్మన్ మహమ్మద్ తన్వీర్, ఝరాసంగం మాజీ ఎంపిపి హన్మంత్ రావు పాటిల్ కాంగ్రెస్ పార్లమెంట్ నియోజక వర్గ ఇంచార్జి శుక్ల వర్ధన్ రెడ్డి లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడం జరిగింది,ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు చింతల్ గట్టు శివరాజ్, రాజకుమార్, సోహెల్, అబిలాష్ రెడ్డి,మాజీ సర్పంచ్ పెంటయ్య, నాయకులు పి.సుధాకర్ రెడ్డి, యస్.గోపాల్,వెంకట్ రెడ్డి, రమేష్,కె.క్రిష్ణ,చెంగల్ జైపాల్, నాగేష్,విఠల్,బి.దిలీప్,పవన్ రాథోడ్,మేఘనాథ్,తదితరులు పాల్గొన్నారు



అక్షర విజేత



# సజ్జాపూర్ ఘటనపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ విచారణ

## - ఈనెల 30న సివిల్ రైట్స్ డే నిర్వహించాలి : కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య.

## - సామాజిక సమానత్వం కోసం కమిషన్ కట్టుదిట్టమైన చర్యలు









(కోహీర్

కోహీర్ మండలం సజ్జాపూర్ గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న ఎస్సీ కుటుంబంపై దాడి ఘటనపై తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు రాంబాబు బుధవారం గ్రామాన్ని సందర్శించి సంఘటనపై సమగ్ర విచారణ చేపట్టారు.సజ్జాపూర్ గ్రామానికి చెందిన బేగరి రాములు ఇంటి షెడ్డు కూల్చివేసిన ఘటనపై బాధిత కుటుంబాన్ని కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ ఘటనను పూర్తిగా అగ్రవర్ణాల దాడిగానే భావిస్తున్నామని కమిషన్ చైర్మన్ పేర్కొన్నారు.బాధితులకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ ఘటనపై ఇప్పటికే ఆరుగురిపై కేసులు నమోదు అయ్యాయని పోలీసు అధికారులు తమకు తెలిపారని అన్నారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని, చట్టప్రకారం తప్పనిసరిగా శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను, జిల్లా యంత్రాంగాన్ని కమిషన్ ఆదేశించింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గ్రామంలో శాంతి భద్రతలు కట్టుదిట్టం చేయాలనిఅధికారులకు ఆయన సూచించారు.ఈ ఘటనను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని, సామాజిక సమానత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని స్పష్టం చేశారు.గ్రామాలలో నివసించే ప్రతి ఒక్కరూ అన్నదమ్ముల్లా కలిసి మెలిసి, శాంతియుత వాతావరణంలో జీవించాలని కమిషన్ చైర్మన్ కోరారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఈనెల 30వ తేదీన సజ్జాపూర్ గ్రామంలో సివిల్ రైట్స్ డేను అధికారికంగా

నిర్వహించాలని జిల్లాయంత్రాంగాన్ని ఆదేశించారు. సివిల్ హక్కుల ప్రాముఖ్యతపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమం ద్వారా సామాజిక సమానత్వం, న్యాయ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం పెరగాలని తెలిపారు.అంతకుముందు కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు రాంబాబు, కోహీర్ మండల కేంద్రంలోని సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న బాలుర, బాలికల వసతి గృహాలను ఆకస్మికంగా సందర్శించారు. వసతి గృహాల పరిసర ప్రాంతాలను పరిశీలించి, భద్రత దృష్ట్యా కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందుతున్నదీ లేదీ వివరంగా ఆరా తీశారు. మెనూ ప్రకారమే భోజనం అందిస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. చదువుపై దృష్టి సారించి, పదో తరగతిలో జిల్లాకు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన వసతి సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం జరగకూడదన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో అన్ని మౌలిక వసతులు సమకూర్చాలని అధికారులకు సూచించారు.

అనంతరం కోహీర్ మండలంలోని శ్రీ సిద్ధి వినాయక ఆలయాన్ని కమిషన్ చైర్మన్, సభ్యులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు రాంబాబుకు అధికారిక లాంఛనాలతో ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ... సమాజంలో సమానత్వం, న్యాయం, సామరస్యాన్ని కాపాడటమే ఎస్సీ, ఎస్టీ కమిషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు కమిషన్ ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలోజడ్పీసీఈఓ ,ఇంచార్జ్ డిపిఓ జానకిరెడ్డి, డి ఎస్పీ సైదానాయక్, సి ఐ శివలింగం, తహసీల్దార్ సుప్రియ,సహాయ సాంఘిక సంక్షేమ అధికారి శ్రీనివాస్, స్థానిక ఏస్ ఐ నరేష్, రెవెన్యూ శాఖ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, షెడ్యూల్ కులాల సంఘం నాయకులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి:

### వైద్య ఆరోగ్యశాఖ సమీక్ష సమావేశంలో

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి







కరీంనగర్ ప్రతినిధి: ప్రభుత్వ ఆసుపత్రులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వైద్య ఆరోగ్యశాఖ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఒక్కో పీహెచ్‌సీ వారీగా సాధించిన ప్రగతి, పీహెచ్‌సీ వారీగా కాన్పులు తదితర వివరాలపై సమీక్షించారు. ప్రసవాలు, ఆరోగ్య మహిళ, ఎన్ఆర్సి, ఆర్బిఎస్కే,108సేవలు, ఆరోగ్యశ్రీ, ఐ, డెంటల్ ఎగ్జామినేషన్, లెప్రసీ సర్వే, టీబీ, ఇమ్యూనైజేషన్ క్యాలెండర్, బూస్టర్ డోస్, గర్భిణీల వివరాలు ఆన్లైన్లో నమోదు చేయడంపై చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కనీసం 80శాతం డెలివరీలు ప్రభుత్వ దవాఖానల్లోనే జరిగేలా చూడాలని, గర్భిణీలకు ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన కల్పించాలని అన్నారు. గర్భం దాల్చిన నాటి నుంచి కాన్పు అయ్యేంత వరకు ఆరోగ్య పరిరక్షణపై ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఆర్ బి ఎస్ కే పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్దేశించిన సంఖ్యలో విద్యార్థులకు స్క్రీనింగ్ చేయాలని, పనితీరు మెరుగు పరచుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి గర్భిణి సంబంధించిన వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, గర్భిణీల్లో రక్త హీనత లేకుండా చూడాలని అన్నారు. నాణ్యమైన సేవలందిస్తూ ప్రభుత్వ దవాఖాన పని తీరు పట్ల ప్రజల్లో మరింత నమ్మకాన్ని పెంచాలని తెలిపారు. పలు ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరుగుతుండటంపై వైద్యాధికారులను ప్రశంసించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ మందుల కొరత రాకుండా చూడాలన్నారు. రాష్ట్రంలోనే మొదటిసారి జిల్లాలో డెంటల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తున్నామని పాఠశాలల్లో, పంచాయితీల్లో వైద్య శిబిరాలు నిర్వహించి పరీక్షలు చేయాలన్నారు.ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న అంబులెన్స్‌ను డ్రైవర్లు లేరనే కారణంతో ఖాళీగా ఉంచొద్దని.. అవసరమైన సిబ్బంది ఉన్నచోట సర్దుబాటు చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా నిక్షయ్ పోర్టల్ లో టీబీ వ్యాధిగ్రస్తుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. వారికి అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి ప్రభుత్వాసుపత్రులకు వస్తున్నారు. ప్రభుత్వం అందించే మందుల కోసం రాష్ట్రంలోనే మన జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య పెరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు.ఇందుకు సిబ్బందిని అభినందించారు. అనంతరం క్రిస్మస్ ను పురస్కరించుకొని కేక్ కట్ చేశారు.ఈ సమావేశంలో డిఎంహెచ్వో వెంకటరమణ, అదనపు డీఎంహెచ్వో సుధా, డిప్యూటీ డిఎంహెచ్వోలు చందు నాయక్, రాజగోపాల్, ఇమ్యునైజేషన్ అధికారి సాజిదా, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, జిజిహెచ్ సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఆర్ఎంఓ నవీన, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# న్యూ ఇయర్ వేడుకల వేళ హద్దులు దాటితే కఠిన చర్యలు

: హైదరాబాద్ సీపీ సజ్జనార్

హైదరాబాద్ ప్రతినిధి:న్యూ ఇయర్ వేడుకల్లో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్న సీపీ ఈవెంట్‌లకు పోలీస్ అనుమతి, సీసీటీవీ ఏర్పాటు తప్పనిసరి అని వెల్లడి.రాత్రి 10 గంటలకే లౌడ్ స్పీకర్లు, సౌండ్ సిస్టమ్‌లు క్లోజ్ చేయాలని ఆదేశాలు..ఈ నెల 31న రాత్రి 9 గంటల నుంచే డ్రంకెన్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ ఉంటుందన్న సజ్జనార్.నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకునేలా చూడడానికి హైదరాబాద్ పోలీసులు సమాయత్తమవుతున్నారు. ఈ క్రమంలో న్యూ ఇయర్ ఈవెంట్లలో నిర్వాహకులు గానీ, ప్రజలు గానీ హద్దులు దాటినా లేక నిబంధనలు అతిక్రమించినా కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కొత్త సంవత్సరం సంతోషం లేకుండా పోతుంది అంటూ ఆయన వార్నింగ్ ఇచ్చారు.న్యూ ఇయర్ సందర్భంగా నగరంలో నిర్వహించే పార్టీలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన విధి విధానాలపై సీపీ సజ్జనార్ క్షేత్రస్థాయి పోలీస్ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై కీలక ఆదేశాలు జారీ చేశారు.



ప్రతి ఈవెంట్ జరిగే ప్రాంతంలో తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. అలాగే పార్టీల నిర్వహణకు ముందుగా పోలీస్ అనుమతిని తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి పొందాలని సూచించారు.బహిరంగ ప్రదేశాల్లో నిర్వహించే వేడుకల్లో సౌండ్ సిస్టమ్‌లు, లౌడ్ స్పీకర్లు రాత్రి 10 గంటలకే పూర్తిగా నిలిపివేయాలని సీపీ స్పష్టం చేశారు. శబ్ద కాలుష్యంపై ఫిర్యాదులు వస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు, 15 షీ టీమ్స్ బృందాలను మఫ్టీలో రంగంలోకి దింపనున్నట్లు తెలిపారు.ఈ నెల 31 అర్ధరాత్రి నగరమంతటా డ్రంకెన్ డ్రైవ్‌పై ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు సీపీ సజ్జనార్ వెల్లడించారు. రాత్రి 9 గంటల నుంచే డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ప్రారంభమవుతాయని, అన్ని ప్రధాన రహదారులు, జంక్షన్ల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రజలు ఆనందంగా న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలని, అయితే చట్టాన్ని గౌరవిస్తూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని హైదరాబాద్ పోలీసులు కోరుతున్నారు.

## క్రిస్మస్ పండగను పురస్కరించుకొని దౌలతాబాద్‌లో ప్రభుత్వం నిర్వహించిన క్రిస్మస్ పండుగ సంబరాల కార్యక్రమానికి మంత్రి వివేక్ గడ్డం వెంకటస్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.



సిద్దిపేట ప్రతినిధి:ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమం కోసం ఎప్పుడూ కృషి చేస్తుందని అన్నారు. ప్రపంచమంతటికి శాంతి, క్షమా గుణాలను అందించిన ఏసుక్రీస్తు ను స్మరించుకుంటూ క్రిస్మస్ పండగలో పాలుపంచుకోవడం నాకు చిన్ననాటి నుండి అలవాటని వారిని అనుసరించి క్షమాగుణాన్ని నేర్చుకున్నానని అన్నారు. క్రైస్తవ సోదరులు సంతోషంగా క్రిస్మస్ పండుగను అందరి మధ్య జరుపుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా క్రిస్మస్ పండుగను నిర్వహిస్తుందని తెలిపారు. ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపడుతుందని వాటిలో భాగంగా మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు 27 వేలకోట్ల రూపాయలను రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం అందించింది అని అన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డుల పంపిణీ తదితర కార్యక్రమాలను చేపట్టిందని, త్వరలో కొత్త పెన్షన్ లను కూడా అందిస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ. ప్రతి సంవత్సరం మీ మధ్యలో క్రిస్మస్ పండుగను జరుపుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. అందరు సంతోషంగా పండుగ జరుపుకోవాలని ఈ క్రిస్మస్ పండుగ సంబరాల కార్యక్రమం ఏర్పాటుచేయడమైనదని తెలిపారు. కొత్తగా ఎన్నికైన గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని, ప్రజలను దేవుడు దీవించాలని ఆశించారు. అనంతరం ముఖ్య అతిథులు క్రిస్మస్ కేకును కట్ చేసి క్రైస్తవ సోదరులకు తినిపించారు. ఈ కార్యక్రమంలో దౌలతాబాద్ సర్పంచ్ అనురాధ రమేష్, పాస్టర్లు, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# రైతు భరోసా పథకంపై తెలంగాణ ప్రభుత్వం కీలక మార్పులు:

హైదరాబాద్ ప్రతినిధి:ఇకపై నాగలి పట్టి సాగు చేసే రైతులకే రైతు భరోసా నిధులని స్పష్టం చేసిన సీఎం రేవంత్.సాగుకు అనుకూలంగా లేని భూములకు గతంలో ఇచ్చినట్లు రైతు భరోసా ఇవ్వడం సాధ్యం కాదని వెల్లడి.ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో వెల్లడించిన సీఎం రేవంత్ రెడ్డి.తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకంలో కీలక మార్పులు చేస్తోంది. ఈ పథకం అమలు, మార్గదర్శకాలపై జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యమైన ప్రకటన చేశారు. ఇకపై రైతు భరోసా నిధులను కేవలం సాగు చేసే రైతులకే అందించాలని ఆయన ఆదేశించారు. సాగుకు అనుకూలంగా లేని భూములకు గతంలో ఇచ్చినట్లుగా ఇవ్వడం సాధ్యం కాదని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని ప్రారంభించింది. రైతన్నలకు పెట్టుబడి సాయంగా ఎకరాకు రూ.4 వేల చొప్పున రెండు సీజన్లకు రూ.8 వేలు మొదట చెల్లించింది. ఆ తర్వాత పెట్టుబడి సాయాన్ని ఎకరాకు రూ.5 వేలకు పెంచింది. అయితే, ఈ పథకంలో అనర్హులు లబ్ధి పొందుతున్నారని ఆరోపణలు వచ్చాయి. వ్యవసాయం చేయని వారు, బీడు భూములు, కొండలు, గుట్టలు ఉన్న భూములకు కూడా నిధులు పొందినట్లు గుర్తించారు.అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు బంధు పథకాన్ని రైతు భరోసా పథకంగా మార్పు చేస్తూ,ఎకరాకు పెట్టుబడి సాయం రూ.6 వేలకు పెంచింది. ఈ పథకం ద్వారా అనర్హులు సైతం లబ్ధి పొందుతున్నారని రేవంత్ ప్రభుత్వం గుర్తించింది. ఈ క్రమంలో అర్హులైన రైతులకే ఈ పథకాన్ని వర్తింపజేయాలని నిర్ణయానికి వచ్చింది. సాగు చేసే భూములకు మాత్రమే పెట్టుబడి సాయం అందించాలని నిర్ణయించారు.